


ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
19-5-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 09
సంచిక: 250

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక మలుపు..



## జీవితఖైదు పడే సెక్షన్ నమోదు

**పోక్సో కేసులో బండి భగీరథ్‌పై మరో కఠిన సెక్షన్ నమోదు**

**బాధితురాలిపై పలుమార్లు అత్యాచారం జరిగిందన్న ఆరోపణలు**

**ప్రత్యేక అధికారిగా డీసీపీ రితిరాజ్ దర్యాప్తుతో కీలక మలుపు**

**నేరం రుజువైతే పదేళ్ల నుంచి జీవిత ఖైదు వరకు శిక్ష పడే అవకాశం**

సంచలనం సృష్టించిన పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్‌పై దర్యాప్తు అధికారులు కేసును మరింత తీవ్రతరం చేశారు. బాధితురాలిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 64(2)(వీ) సెక్షన్‌ను అదనంగా చేర్చారు. ఈ సెక్షన్ కింద నేరం రుజువైతే నిందితుడికి పదేళ్లకు పైగా జైలు శిక్ష, కొన్ని సందర్భాల్లో జీవిత ఖైదు కూడా విధించే అవకాశం ఉంది. ఈ నెల 8న బాధితురాలైన మైనర్‌పై లైంగిక వేధింపులు జరిగాయంటూ ఆమె తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పుడు, కేసు నమోదు విషయంలో పోలీసులు హైడ్రామా సృష్టించారని, బలహీనమైన సెక్షన్లు నమోదు చేశారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. బాధితురాలి నుంచి

2లో

# త్వరలో హైదరాబాద్ మెట్రో రద్దీకి చెక్..

హైదరాబాద్ మెట్రోకు **60** కొత్త కోచ్‌లు

ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ కీలక నిర్ణయం

బెంగళూరు బీఈఎంఎల్‌తో ఒప్పందానికి రంగం సిద్ధం

**15** నెలల్లో కోచ్‌ల సరఫరాకు సంస్థ హామీ

పెరగనున్న రైళ్ల ఫ్రీక్వెన్సీతో ప్రయాణికులకు ఊరట





# ఐదేళ్లలో అభివృద్ధి చేస్తాం

**మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల రూపు రేఖలు మార్చడమే మా లక్ష్యం**

**నిర్దేశిత లక్ష్యంలోగా మావోయిస్టులను నిర్మూలించాం**

**కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెల్లడి**

**యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్‌లో పాల్గొన్న అధికారులకు సత్కారం**

హైదరాబాద్: రాబోయే ఐదేళ్లలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల రూపురేఖలు మార్చడం తమ తదుపరి లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. నిర్దేశిత లక్ష్యం 2026 మార్చి 31లోగా దేశంలో మావోయిస్టులను నిర్మూలించడంలో కృషి చేసిన పోలీసులు, భద్రతా బలగాలను సోమవారం జగదల్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. దీంతోపాటు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కొత్తగా అందుబాటులోకి వచ్చిన సేవా కేంద్రాలను నేతనార్ గ్రామంలో అమిత్ షా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. తమ దగ్గర అభివృద్ధి జరగకపోవడం వల్లే ఆయుధాలు చేపట్టామనే తప్పుడు ప్రచారం చేస్తూ మావోయిస్టులు బస్తర్ ప్రాంతానికి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ఇటీవల మూడు వేల మంది మావోయిస్టులు లొంగిపోతే, అందులో రెండు వేల మందికి కనీసం రాయడం, చదవడం రాదని, ఈ ప్రాంతానికి మావోయిస్టులు చేసిన అన్యాయాలకు ఇదో ఉదాహరణ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేసిన కృషితో ఈ ప్రాంతం నుంచి మావోయిస్టులను నిర్మూలించామని పేర్కొన్నారు.

2లో

# ఢిల్లీలో 'యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా" సదస్సు




**పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యం**

**విశాఖను ఏఐ, డేటా సెంటర్ల హబ్‌గా అభివృద్ధి చేసే ప్రణాళిక**

**డేటా సెంటర్ల చుట్టూ పూర్తిస్థాయి తయారీ ఎకోసిస్టమ్ నిర్మాణం**

**అమెరికా-భారత్ అణుశక్తి సహకారంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందన్న లోకేష్**

**న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఏపీని నమ్మకమైన భాగస్వామిగా నిలుపుతాం: ఢిల్లీలో మంత్రి లోకేష్**

భవిష్యత్ అణు ఇంధన (న్యూక్లియర్ ఎనర్జీ) ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్‌ను నమ్మకమైన ప్రపంచ భాగస్వామిగా నిలబెట్టడమే తమ ధ్యేయమని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ప్రపంచ న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశలోకి ప్రవేశిస్తున్న తరుణంలో ఇది అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. న్యూఢిల్లీలో న్యూక్లియర్ ఎనర్జీ ఇనిస్టిట్యూట్ (ఎన్ఈఐ), యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరం (యూఎస్ఐఎస్ పీఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన "యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా" సదస్సులో లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

**ఆంధ్రప్రదేశ్‌లో సహజసిద్ధ ప్రయోజనాలు**

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "ఆధునిక న్యూక్లియర్ సాంకేతికతలైన స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, తదుపరి తరం రియాక్టర్ సిస్టమ్స్‌కు విస్తృత అవకాశాలున్నాయి. భారత్‌లో ఇంజనీరింగ్ ప్రతిభ, తయారీ రంగంలో నైపుణ్యం, తక్కువ ఖర్చుతో కూడిన

2లో



# కేరళ సీఎంగా సతీశన్ ప్రమాణ స్వీకారం



## బండి భగీరథ్ కేసు.. రామచందర్ రావు కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్: తెలంగాణలో బండి భగీరథ్ కేసు విషయం సంచలనంగా మారిన సంగతి

# బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం


**మత ఆధారిత సంక్షేమ పథకాలు రద్దు**

**ఇమామ్‌లు, పూజరులకు గౌరవ వేతనం రద్దు**

**అన్నపూర్ణ పథకం కింద అర్హులైన మహిళలకు 3వేల సాయం**



కోల్‌కతా: సువేందు అధికారి నేతృత్వంలోని వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సోమవారం సీఎం సువేందు అధికారి అధ్యక్షతన బెంగాల్ కేబినెట్ భేటీ జరిగింది. ఈ సమావేశంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను నిలిపివేయాలని



# మరో నాలుగు రోజులు భగభగలు

**ఎనిమిది జిల్లాల్లో తీవ్ర వడగాడ్పుల ప్రభావం**

**రెడ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ**

# మరింత పటిష్టంగా భారత్-నార్వే బంధం

**ఇంధనం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారం**

**ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఏర్పాటు**

**నార్వే పర్యటనలో ప్రధాని మోదీ కీలక ప్రకటన**

న్యూఢిల్లీ: భారత్-నార్వే సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే స్వచ్ఛ ఇంధనం, సముద్ర రంగం,



# బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక మలుపు..

వాంగ్మూలం తీసుకునే క్రమంలో పోలీసులు నిజం చెప్పకుండా ఒత్తిడి చేశారన్న విమర్శలు రావడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ఈ కేసుకు ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించింది. వెంటనే రంగంలోకి దిగిన డీసీపీ రితిరాజ్, సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కేసు ఫైళ్లను పరిశీలించారు. పోలీసులు నమోదు చేసిన వాంగ్మూలంలో స్పష్టత లేదని గుర్తించి, దర్యాప్తును లోతుగా చేపట్టారు. మంగళవారం డీసీపీ స్వయంగా బాధితురాలి ఇంటికి వెళ్లి, ఆమెతో స్నేహపూర్వక వాతావరణంలో మాట్లాడారు. పోక్సో కేసుల దర్యాప్తు నిబంధనల ప్రకారం, ఆమె నుంచి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. బాధితురాలు చెప్పిన విషయాలకు, పోలీసులు మొదట నమోదు చేసిన సెక్షన్లకు పొంతన లేదని గ్రహించారు. బాధితురాలిపై పలుమార్లు లైంగిక దాడి జరిగిందని ఆమె వాంగ్మూలం ద్వారా తెలియడంతో ఇది అత్యంత తీవ్రమైన నేరమని డీసీపీ నిర్ధారించుకున్నారు. బాధితురాలి ఆరోపణలు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1), 6 పరిధిలోకి వస్తాయని గుర్తించారు. దీనికి సమానమైన బీఎన్ఎస్ సెక్షన్ 64(2)(వీ)ను కేసులో చేర్చాలని ఆదేశించారు. ఈ సెక్షన్ల ప్రకారం నేరం రుజువైతే నిందితుడికి కనిష్ఠంగా 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, గరిష్ఠంగా జీవిత ఖైదు విధించే అవకాశం ఉంటుంది. డీసీపీ రితిరాజ్ నేతృత్వంలో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది.

# త్వరలో హైదరాబాద్ మెట్రో రద్దీకి చెక్..

హైదరాబాద్ నగరంలో మెట్రో ప్రయాణికులకు త్వరలోనే పెద్ద ఊరట లభించనుంది. నిత్యం ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసిపోతున్న మెట్రో రైళ్లలో ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు 60 కొత్త కోచ్‌లను కొనుగోలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేసింది. బెంగళూరుకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్) నుంచి ఈ కోచ్‌లను కొనుగోలు చేయనున్నారు. ఈ వారంలోనే హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ, బీఈఎంఎల్ మధ్య అధికారిక ఒప్పందం కుదిరే అవకాశం ఉంది.ప్రస్తుతం హైదరాబాద్‌లోని మూడు కారిడార్లలో మొత్తం 56 రైళ్లు సేవలందిస్తున్నాయి. ఒక్కో రైలుకు మూడు కోచ్‌లు మాత్రమే ఉండటంతో ప్రతిరోజూ ప్రయాణించే దాదాపు 5 లక్షల మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఎల్బీనగర్ - మియాపూర్, నాగోల్ - రాయదుర్గం మార్గాల్లో రైళ్లలో నిలబడటానికి కూడా చోటు దొరకని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే అదనపు కోచ్‌ల కొనుగోలు అనివార్యంగా మారింది. ఆర్డర్ ఇచ్చిన నాటి నుంచి కేవలం 15 నెలల వ్యవధిలోనే కొత్త కోచ్‌లను సరఫరా చేస్తామని బీఈఎంఎల్ ప్రభుత్వానికి స్పష్టం చేసింది.గతంలో రద్దీని అధిగమించేందుకు నాగ్‌పూర్ మెట్రో నుంచి కొన్ని కోచ్‌లను లీజుకు తీసుకోవాలని ప్రయత్నించినా, సాంకేతిక కారణాలతో అది ముందుకు సాగలేదు. అయితే, ఇటీవల హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి రావడంతో కోచ్‌ల కొనుగోలుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. దీంతో బీఈఎంఎల్‌కు ఆర్డర్ ఇచ్చే ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. 2015లో సుమారు రూ.1800 కోట్లతో దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ రొటెమ్ సంస్థ నుంచి మెట్రో కోచ్‌లను కొనుగోలు చేశారు. ఇప్పుడు కొత్త కోచ్‌ల తయారీ కోసం హ్యుందాయ్ తమ సాంకేతికతను బీఈఎంఎల్‌కు బదిలీ చేసేందుకు అంగీకరించింది. దేశంలోని అనేక మెట్రో ప్రాజెక్టులకు విజయవంతంగా కోచ్‌లను సరఫరా చేసిన అనుభవం బీఈఎంఎల్‌కు ఉంది. ఈ 60 కొత్త కోచ్‌లు అందుబాటులోకి వస్తే, రద్దీ మార్గాల్లో రైళ్ల ఫ్రీక్వెన్సీ పెరగడంతో పాటు ప్రయాణికులకు సీటింగ్ సామర్థ్యం కూడా పెరుగుతుంది. ఫలితంగా మెట్రో ప్రయాణం మరింత సౌకర్యవంతంగా, సుఖవంతంగా మారనుంది.



## బండి భగీరథ్ కేసు.. రామచందర్ రావు కీలక వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

తెలిసిందే. రాజకీయంగా కూడా ఈ కేసులో ప్రకంపనలు సృష్టించింది. అయితే, ఈ కేసులో విషయమై తాజాగా తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. బండి భగీరథ్ తండ్రి తప్పుచేయనప్పుడు రాజీనామా ఎందుకు చేయాలని ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ..'బండి భగీరథ్ తండ్రి ఎలాంటి తప్పు చేయలేదు. ఆయన తప్పుచేస్తే పార్టీ తప్పకుండా చర్యలు తీసుకుంటుంది. మా మంత్రి తప్పు చేస్తే మాది బాధ్యత. ముందస్తు బెయిల్ తీసుకోవడం హక్కు. ఆయన పారిపోలేదు. బెయిల్ పెండింగ్‌లో ఉంది. అనంతరం, భగీరథ్ సరెండర్ అయ్యాడు. ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత జైలుకు వెళ్తే కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. కోట్లు ఖర్చు చేసి భగీరథ్, ఆయన తండ్రికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు' అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేతలకు ఏ పని లేనట్టు బండి భగీరథ్ కుటుంబాన్ని టార్గెట్ చేయడం సరికాదు. ఆ కుటుంబంలో కేంద్ర మంత్రి ఉన్నాడని టార్గెట్ చేశారు. కాళేశ్వరం కేసులో బీఆర్ఎస్ వాళ్లు ముందుగానే కోర్టుకు ఎందుకు వెళ్లారు?. ఈ కారు రేసింగ్ కేసులో కేటీఆర్ ముందస్తుగా కోర్టుకు వెళ్లలేదా?. మీ బీఆర్ఎస్ హయాంలో మహిళలపై దాడులు ఎన్నో జరిగాయి. పబ్‌లో ఎంఐఎం నేత కొడుకు అత్యాచారం చేయలేదా? ఏం చేశారు. కొమురం భీం జిల్లాలో సామూహిక అత్యాచారం జరిగింది. గతంలో లంబాడా అమ్మాయి మీద కస్టోడియల్ డెత్ జరగలేదా?. గతంలో మీ పాలనలో అత్యాచారాలు జరిగితే మరి కేసీఆర్ రాజీనామా చేశారా?. కాళేశ్వరం, కారు రేసు కేసులో త్వరగా విచారణ జరిగేలా కాంగ్రెస్ నేతలు ఒత్తిడి తేవాలి. మోదీ సభ విజయంతో తెలంగాణ ప్రజల బీజేపీ వైపు చూస్తున్నారు. బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం నమ్మొద్దు అని వ్యాఖ్యలు చేశారు.

# ఢిల్లీలో 'యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా" సదస్సు

ఉత్పత్తి వంటివి కలిసొచ్చే అంశాలు. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు పారిశ్రామిక మౌలిక వసతులు, పోర్టులు, లాజిస్టిక్స్, వేగవంతమైన అమలు సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఇది భారతదేశానికి, ఏపీకి ఒక చరిత్రాత్మక అవకాశం" అని వివరించారు. రాష్ట్రానికి ఉన్న సువిశాల తీరప్రాంతం, శక్తివంతమైన పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పారిశ్రామిక కారిడార్లు, ప్రతిష్టాత్మక పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఎకోసిస్టమ్ వంటివి అదనపు ప్రయోజనాలని తెలిపారు. పారిశ్రామికీకరణలో వేగం, అమలు అత్యంత ముఖ్యమని, ఇందులో న్యూక్లియర్ ఎకోసిస్టమ్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు.

**ఎనర్జీ సెక్యూరిటీ మాకు అత్యంత కీలకం**

ప్రపంచ దేశాలు ఆర్థికవృద్ధి, పారిశ్రామిక వ్యాప్తి, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, కర్బన ఉద్గారాల తగ్గింపు వంటివి ఏకకాలంలో ఎలా సాధించాలని ఆలోచిస్తున్నాయని లోకేష్ అన్నారు. వాతావరణ మార్పులపై ఇచ్చిన హామీలను పాటిస్తూ, ఏఐ యుగానికి అవసరమైన విద్యుత్‌ను తక్కువ ఖర్చుతో, సురక్షితంగా ఎలా అందించాలన్నది పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆకాంక్షలు విస్తృతంగా ఉన్న నేపథ్యంలో ఇంధన భద్రత (ఎనర్జీ సెక్యూరిటీ) మాకు అత్యంత ప్రాధాన్య అంశం. నేడు ఏపీ దేశంలోనే కీలకమైన పారిశ్రామిక, డిజిటల్ కేంద్రంగా మారుతోంది," అని లోకేష్ స్పష్టం చేశారు.

**ఇంధన పరివర్తనపై ఆంధ్రప్రదేశ్ దృష్టి**

రాష్ట్రంలో కొత్త పారిశ్రామిక కారిడార్లను నిర్మిస్తున్నామని, ఎలక్ట్రానిక్స్ తయారీ సామర్థ్యాన్ని పెంచుతున్నామని లోకేష్ తెలిపారు. విశాఖపట్నాన్ని ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామని, అక్కడ 6 గిగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు రాబోతున్నాయని వెల్లడించారు. భవిష్యత్ పరిశ్రమలకు భారీ పరిమాణంలో, 24/7 నిరంతరాయంగా, కాలుష్యరహిత, తక్కువ ఖర్చుతో కూడిన విద్యుత్ అవసరమని, అందుకే ఇంధన ప్రణాళిక ఆర్థిక ప్రణాళికలో కీలకంగా మారిందని వివరించారు. "మా ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా రెన్యూవబుల్స్, స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్‌మిషన్, గ్రిడ్ ఆధునీకరణ వంటి రంగాల్లో సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకున్నాం," అని ఆయన ప్రకటించారు.

**భవిష్యత్తులో భారీగా విద్యుత్ అవసరం**

భవిష్యత్ పారిశ్రామిక వృద్ధికి కేవలం పునరుత్పాదక శక్తి సరిపోదని తాము వాస్తవికంగా ఆలోచిస్తున్నామని లోకేష్ అన్నారు. ఏఐ కంప్యూటింగ్ విస్తరిస్తున్న కొద్దీ విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరుగుతోందని, ఒక హైపర్‌స్కేల్ ఏఐ-నేటివ్ డేటా సెంటర్ ఒక మధ్యస్థ పట్టణానికి సమానమైన విద్యుత్‌ను వినియోగిస్తుందని ఉదహరించారు. గ్లోబల్ కంపెనీలు విశాఖలో గిగావాట్ సామర్థ్యంగల ఏఐ-నేటివ్ డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకొస్తున్నాయని, వీటికి భారీ విద్యుత్ అవసరమవుతుందని తెలిపారు.

**డేటాసెంటర్ల చుట్టూ తయారీ ఎకోసిస్టమ్**

తమ దృష్టిలో డేటా సెంటర్ అంటే కేవలం సర్వర్లతో కూడిన భవనాలకు ఆతిథ్యమివ్వడం కాదని, దాని చుట్టూ ఒక పూర్తిస్థాయి తయారీ ఎకోసిస్టమ్‌ను నిర్మించడమే తమ లక్ష్యమని లోకేష్ స్పష్టం చేశారు. కూలింగ్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, బ్యాటరీ స్టోరేజ్ వంటి వాటిని స్థానికంగా తయారు చేయడాన్ని ప్రోత్సహిస్తామని తెలిపారు. ఏఐ టెక్నీషియన్లు, ఎనర్జీ ఇంజనీర్ల కోసం ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి సంస్థలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

**న్యూక్లియర్ ఎనర్జీ సప్లయ్ చైన్‌లో భాగస్వామ్యం**

న్యూక్లియర్ ఎనర్జీని కూడా ఒక పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థగా చూడాలని లోకేష్ అభిప్రాయపడ్డారు. కేవలం విద్యుత్ ఉత్పత్తికే పరిమితం కాకుండా, పూర్తి న్యూక్లియర్ వాల్యూ చైన్‌లో భాగస్వామ్యం కావడమే ఏపీకి దీర్ఘకాలిక అవకాశమని అన్నారు. కీలక విడిభాగాలు తయారు చేయడం, అత్యాధునిక ఇంజనీరింగ్ సామర్థ్యాలు నిర్మించడం, ప్రపంచస్థాయి భద్రతా ప్రమాణాలు నెలకొల్పడం, భవిష్యత్ వర్క్‌ఫోర్స్‌కు శిక్షణ ఇవ్వడం వంటి వాటిపై దృష్టి సారిస్తామని వెల్లడించారు.

**ఎకో సిస్టమ్ నిర్మాణానికి సరైన సమయం**

న్యూక్లియర్ ప్రాజెక్టులకు బదులుగా న్యూక్లియర్ పారిశ్రామిక ఎకోసిస్టమ్‌లను నిర్మించడానికి ఇదే సరైన సమయమని లోకేష్ పేర్కొన్నారు. అణుశక్తి విశ్వసనీయ బేస్‌లోడ్ విద్యుత్‌ను అందిస్తుందని, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని, దీర్ఘకాలంలో పోటీ ధరలకు విద్యుత్‌ను అందిస్తుందని వివరించారు. ఆధునిక న్యూక్లియర్ టెక్నాలజీల వల్ల భద్రతా ప్రమాణాలు కూడా గణనీయంగా మెరుగుపడ్డాయని గుర్తుచేశారు.

**ఇంధన భవిష్యత్ పైనే ఏఐ భవిష్యత్**

ఏఐ విప్లవం వల్ల ఇంధనానికి డిమాండ్ పెరిగిందని, దీనివల్ల న్యూక్లియర్ ఎనర్జీ ప్రాముఖ్యతను ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయని లోకేష్ అన్నారు. "ఏఐ భవిష్యత్తు ఇంధన భవిష్యత్తుపై ఆధారపడి ఉంటుంది. భవిష్యత్తులో నమ్మకమైన, స్వచ్ఛమైన బేస్‌లోడ్ విద్యుత్ తప్పనిసరి. ఇది ప్రభుత్వాలు, టెక్నాలజీ ప్రొవైడర్లు, పెట్టుబడిదారుల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాలకు అపారమైన అవకాశాలు సృష్టిస్తుంది.

# మరో నాలుగు రోజులు భగభగలు

హైదరాబాద్: రాష్ట్రంలో ఎండలు భగ్గుమంటున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 డిగ్రీల మేర అధికంగా నమోదవుతున్నాయి. మరో నాలుగు రోజులు రాష్ట్రంలో ఇదే తరహా వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ఆదిలాబాద్, జగిత్యాల, ఆసిఫాబాద్, మంచిర్యాల, నల్లగొండ, పెద్దపల్లి, సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లాల్లో తీవ్ర వడగాడ్పుల ప్రభావం ఉంటుందంటూ రెడ్ అలర్ట్ జారీ చేసింది. సోమవారం రాష్ట్రంలోకెల్లా నిజామాబాద్ జిల్లా కోటగిరిలో 45.6 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మరోవైపు నైరుతి రుతుపవనాల కదలికలు చురుగ్గా కొనసాగుతున్నాయని.. సోమవారం ఆగ్నేయ అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, అండమాన్ సముద్రంలోని చాలా ప్రాంతాలతోపాటు అండమాన్ నికోబార్ దీవుల్లోకి పూర్తిగా, మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లోకి రుతుపవనాలు ప్రవేశించినట్లు వాతావరణ శాఖ తెలిపింది. అలాగే పశ్చిమ మధ్యప్రదేశ్ నుంచి మధ్య మహారాష్ట్ర, మరఠ్వాడ, ఉత్తర అంతర్గత కర్ణాటక మీదుగా దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు ఉపరితల ద్రోణి ఏర్పడిందని తెలిపింది. అదేవిధంగా సోమవారం దక్షిణ కోస్తాంధ్ర తీర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని పేర్కొంది.

# మరింత పటిష్టంగా భారత్-నార్వే బంధం

ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ప్రధాని తెలిపారు.పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌కు మద్దతుగా నిలిచినందుకు నార్వే ప్రభుత్వానికి మోదీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అస్థిరత పెరుగుతున్న సమయంలో భారత్-యూరప్ భాగస్వామ్యం మరింత కీలకమైందని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ నిబంధనలు, శాంతి భద్రతల పరిరక్షణలో భారత్, యూరప్ కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. భారత్-ఈయూ మధ్య చారిత్రక ఒప్పందంతో భారత్, నార్వేకు అనేక ప్రయోజనాలున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్-నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇస్రో-నార్వే స్పేస్ ఏజెన్సీ మధ్య ఒప్పందం కుదిరిందని, పరిశోధనల కోసం నార్వే సహాయం తీసుకుంటామని పేర్కొన్నారు. నార్వే సంస్థలు భారతదేశంలో గ్రీన్ ఎనర్జీ, షిప్పింగ్, బ్లూ ఎకానమీ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని మోదీ ఆహ్వానించారు. అలాగే ఆర్కిటిక్ పరిశోధనలు, అంతరిక్ష రంగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో కూడా భారత్-నార్వే కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు.

# ఐదేళ్లలో అభివృద్ధి చేస్తాం

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ సూచనలతో బస్తర్‌లో గుజరాత్ తరహాలో పాడి పరిశ్రమ అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించిందని అమిత్ షా చెప్పారు. ఇకపై వచ్చే ఉద్యోగాల భర్తీ ప్రకటనల్లో 15 శాతం ఉద్యోగాలను బస్తర్ ఆదివాసీల కోసం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి నిరోధకులుగా మారిన మావోయిస్టులను నిర్మూలించేందుకు 2018 నుంచి విస్తృత ప్రయత్నాలు జరిగాయని అమిత్‌షా అన్నారు. ఢిల్లీలో పెద్ద పెద్ద భవనాల్లో కూర్చుని కాగితాలు, కంప్యూటర్ల మీద ఎన్నో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించడానికి 2026 మార్చి 31వ తేదీని గడువుగా పెట్టుకున్నామని అమిత్ షా గుర్తుచేశారు. పై స్థాయిలో ఎన్ని ప్లాన్లు వేసినా వాటి క్షేత్రస్థాయిలో ఎలా అమలు చేస్తారనేది కీలకమని, ఆ విషయంలో వివిధ రాష్ట్రాల పోలీసు విభాగాలు, పారా మిలిటరీ బలగాలు, స్పెషల్ ఫోర్సులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పని చేశాయని కితాబునిచ్చారు. ఆ ఆపరేషన్‌లో పాల్గొన్న బలగాలకు ఆయన అభినందనలు తెలిపారు.

**తెలంగాణకు అభినందనలు**

బస్తర్‌లో మావోయిస్టుల ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ ఆ పార్టీకి దిశానిర్దేశం చేసే నేతల్లో ఎక్కువ మంది తెలంగాణకు చెందిన వారున్నారు. దీంతో నిర్దేశిత గడువులోగా మావోయిస్టులను నిర్మూలించడంలో తెలంగాణ పోలీస్ అధికారులు కీలకంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో జగదల్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ భద్రతా సలహాదారు శివధర్‌రెడ్డి (మాజీ డీజీపీ), తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, మల్కాజ్‌గిరి సీపీ బి.సుమతి (ఎస్ఐబీ మాజీ చీఫ్), డీజీపీ ఆపరేషన్స్ (ఆక్టోపస్, గ్రేహౌండ్స్) అనిల్ కుమార్‌ను అమిత్‌షా సత్కరించారు. మావోయిస్టు కార్యకలాపాల నిరోధానికి శివధర్‌రెడ్డి విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయ్, హోంమంత్రి విజయ్‌శర్మ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేరళ సీఎంగా సతీశన్ ప్రమాణ స్వీకారం

తిరువనంతపురం : కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ సోమవారం కేరళ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలతోపాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు.తెలంగాణ సమాచారం సతీశన్‌తో పాటు మొత్తం 20 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేయగా, కొత్త క్యాబినెట్‌లో రమేష్ చెన్నితల, కే మురళీధరన్, సన్నీ జోసెఫ్ తదితర కాంగ్రెస్ సీనియర్ నేతలకు చోటు దక్కింది. ఐయూఎంఎల్ నుంచి పీకే కున్హాలికుట్టి, కేఎం షాజీ, వీఈ అబ్దుల్ గఫూర్, ఎన్ షంసుద్దీన్, పీకే బషీర్ తొలిసారిగా మంత్రివర్గంలో అడుగు పెట్టారు.

# బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం

మంత్రి మండలి నిర్ణయించింది. 2026, జూన్ నుంచి ఈ పథకాలు నిలిపివేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సంక్షేమ కార్యక్రమాలకు మతం రంగు పులమకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని గత టీఎంసీ సర్కార్ ఇమామ్‌లు, ముఅజ్జిన్‌లు, ఆలయ పూజారులకు నెలవారీ గౌరవ వేతనాన్ని అందించిన విషయం తెలిసిందే. పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా ఉన్న ఇమామ్‌లకు ప్రభుత్వం నెలవారీ గౌరవ వేతనాన్ని అందించింది. ఈ పథకం కింద ఆర్థికంగా బలహీన వర్గాల నుంచి వచ్చిన ఇమామ్‌లు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందజేసేవారు. అలాగే, మసీదులలో భక్తులను ప్రార్థనకు పిలిచే ముఅజ్జిన్‌లకు కూడా ఇదే విధమైన ఆర్థిక సహాయ అందించారు. ఈ రెండు పథకాలకు నిధులనూ మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి ఇచ్చేవారు. పంపిణీ చేశారు. ఇమామ్‌ల మాదిరిగానే హిందూ పూజారులు లేదా పురోహితుల కూడా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. ఈ పథకం కింద ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన పురోహితులు నెలకు రూ.2 వేల గౌరవ వేతనాన్ని అందుకున్నారు. ఇటీవల జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ

ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఘోర పరాజయం పాలైంది. దీంతో బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన సువేందు అధికారి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే గత టీఎంసీ సర్కార్ అమలు చేసిన మత ఆధారిత సంక్షేమ పథకాలను సువేందు అధికారి రద్దు చేశారు. ఇకపోతే బీజేపీ ప్రభుత్వం పలు ఇతర సంక్షేమ పథకాల అమలుకు సిద్ధమవుతోంది.

# విద్యుత్ కార్మికుల సమస్య పరిష్కారానికి 1104 యూనియన్ ముందంజ

## విద్యుత్ కార్మికుల ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు డివిజన్ కోశాధికారి షరీఫ్



**ప్రభాత సూర్య చండూర్:** తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో చండూర్ సబ్ స్టేషన్ ఆవరణలో సోమవారం మేడే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కోశాధికారి యం.డి.షరీఫ్ పాష మేడే జెండాను ఆవిష్కరించినారు. జెండా ఆవిష్కరణ అనంతరం బాణాసంచాలతో మేడే సంబురాలు జరిపారు. అనంతరం ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన 1104 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా కార్యదర్శి ఎన్. వెంకటయ్య హాజరై మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీల తో సంబంధం లేకుండా నిరంతరం విద్యుత్ కార్మికుల సమస్యలపై పోరాడే ఏకైక యూనియన్ 1104 యూనియన్ అని అలాగే సంస్థలో విద్యుత్ కార్మికులు నిరంతరం కష్టపడి 24 గంటలు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారని, ఆర్టిజన్ కార్మికులకు గ్రేడ్ ల వారీగా ప్రమోషన్లు కల్పించాలని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతన సవరణ చేయాలని, విద్యుత్ కనెక్షన్ల సంఖ్య పెరిగి లైన్ మెన్ లపై అధిక పని భారం పడుతుందని క్షేత్రస్థాయిలో జూనియర్ లైన్ మాన్ ల పోస్టులు భర్తీ చేసి పని భారం తగ్గించాలని, విద్యుత్ సంస్థలో పని చేస్తున్నటువంటి కార్మికులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. సమావేశానంతరం డివిజన్ కోశాధికారి షరీఫ్ పాష ఆధ్వర్యంలో జిల్లా నాయకులను, డివిజన్ నాయకులను శాలువలతో ఘనంగా సత్కరించినారు. ఇట్టి కార్యక్రమంలో నల్లగొండ జిల్లా కార్య నిర్వహణ అధ్యక్షులు,డివిజన్ కార్యదర్శి టి.శ్రీనివాసులు, డివిజన్ అధ్యక్షులు రాంబాబు,డివిజన్ అదనపు కార్యదర్శి ఆర్.బాలు నాయక్, డివిజన్ కోశాధికారి యం.డి. షరీఫ్ పాష,డివిజన్ జాయింట్ కార్యదర్శి లింగయ్య,డిస్కం ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.ముత్తయ్య, ,చండూర్ సెక్షన్ లీడర్ షజ్జు పాష , సబ్ డివిజన్ లీడర్ అశోక్,ఎల్లేశం,ముత్యంరెడ్డి, దోటి శ్రీను, యం.వెంకన్న, సైదులు,యాసిన్, రమేష్ , అద్దంకి వెంకన్న ,సురేష్ రెడ్డి, మీటర్ రీడర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది:ఎమ్మెల్యే బిఎల్ఆర్





**మిర్యాలగూడ మే 18:-( ప్రభాత సూర్య):** మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గ్రౌండ్ లో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, మిర్యాలగూడ నియోజకవర్గంలో యువత, క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో సోమవారం క్రీడా, యువజన వారోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ముఖ్య అతిథిగా జెండా ఊపి క్రీడా పోటీలను, 5కె రన్, వాక్ థాన్ను ప్రారంభించారు. పిల్లలతో కలిసి రన్నింగ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతిభావంతులైన క్రీడాకారులకు అవసర మౌలిక సదుపాయాలు, శిక్షణ అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజల వద్దకే పాలనను తీసుకువెళు_న్నామని, యువత సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి. శ్రీనివాస్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలకృష్ణ, కౌన్సిలర్లు దేశిడి శేఖర్ రెడ్డి, బూడిద సైదులు, షేక్ అబ్దుల్లా, పీడీ కె. వెంకటేశ్వర్లు యాదవ్, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, యువజన సంఘాల నాయకులు, క్రీడాకారులు, కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

# భౌతిక శాస్త్రంలో రవి వర్మకు పీహెచ్.డీ.



**పటాన్చెరు, మే 18,ప్రభాత సూర్య :** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, భౌతిక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి ఐ.ఎస్. రవి వర్మ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'నానోకాంపోజిట్ పాలిమర్ బ్లెండ్ ఎలక్ట్రోలైట్లలో సోడియం అయాన్ ప్రసరణ యంత్రాంగం యొక్క అధ్యయనం' చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ భౌతిక శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. రమేష్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ రవి వర్మ పరిశోధన తదుపరి తరం శక్తి నిల్వ వినియోగం కోసం అధునాతన నానోకాంపోజిట్ పాలిమర్ ఎలక్ట్రోలైట్ ఫిల్మ్ ల అభివృద్ధిపై దృష్టి సారించినట్టు తెలియజేశారు. ఈ అధ్యయనంలో చీూళీ6 లవణం, ఇథలీన్ కార్బోనేట్ ప్లాస్టిసైజర్,ూశ్రీ2ూ3, నానోఫిల్లర్ ను చేర్చిన పాలిమర్ బ్లెండ్ ఎలక్ట్రోలైట్ వ్యవస్థను సంశ్లేషణ చేయడం ద్వారా గది ఉష్ణోగ్రత వద్ద మెరుగైన అయానిక వాహకతను సాధించారన్నారు. ఈ పరిశోధనలో, ఎఫ్. టీ. ఐ. ఆర్, డి. సి ఎస్, ఎస్. ఈ ఎం, ఎక్స్. ఆర్. డి, ఎలక్ట్రోకెమికల్ ఇంపిడెన్స్ స్పెక్ట్రోస్కోపీ వంటి అధునాతన లక్షణీకరణ పద్ధతులను ఉపయోగించి, అభివృద్ధి చేసిన ఫిల్మ్ ల యొక్క నిర్మాణాత్మక, విద్యుత్, విద్యుద్వాహక, విద్యుత్ రసాయన ధర్మాలను అన్వేషించినట్టు తెలిపారు. సురక్షితమైన, అధిక పనితీరు గల సాలిడ్-స్టేట్ సోడియం-అయాన్ బ్యాటరీలు, పునరుత్పాదక శక్తి నిల్వ వ్యవస్థలు, సూపర్ కెపాసిటర్లు, ఫ్యూయల్ సెల్స్, ఎలక్ట్రోక్రోమిక్ పరికరాలు, ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్ లో ఈ పదార్థాన్ని ఉపయోగించడానికి బలమైన సామర్థ్యం ఉందని ఈ పరిశోధన ఫలితాలు నిరూపిస్తున్నాయని వివరించారు. భవిష్యత్ శక్తి సాంకేతికతల కోసం సమర్థవంతమైన, సుస్థిరమైన సాలిడ్-స్టేట్ ఎలక్ట్రోకెమికల్ పరికరాల అభివృద్ధికి ఈ అధ్యయనం గణనీయంగా దోహదపడుతుందని భావిస్తున్నామన్నారు. డాక్టర్ రవి వర్మ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ టి.విశ్వం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# శాంతినగర్‌లో నూతన ఆహార కేంద్రం ప్రారంభం

### ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎండీఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు మాద్రి పృథ్వీరాజ్



**పటాన్చెరు, మే 18,ప్రభాత సూర్య :** పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన "శ్రీ కృష్ణ కేఫ్ అండ్ బేకర్స్" ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండీఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు రుచికరమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం, ఆత్మీయ సేవలు అందిస్తూ మంచి గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రజలకు అందుబాటులో నాణ్యమైన ఆహార సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, చంద్రశేఖర్, కృష్ణ ప్రవీణ్, సంతోష్‌తో పాటు స్థానిక ప్రముఖులు, స్నేహితులు, ఆహ్వానితులు పాల్గొన్నారు.



# ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రారంభమైన క్రీడా మరియు యువజన వారోత్సవాలు..



**ప్రభాత సూర్య చండూర్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 నుండి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న క్రీడా మరియు యువజన వారోత్సవాల కార్యక్రమం సోమవారం నాడు చండూరు మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, ఎంఈఓ ఉట్కూరు సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో బి. యాదగిరి మరియు కౌన్సిలర్లు హాజరై వారు మాట్లాడుతూ యువత, విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి క్రీడల పట్ల అవగాహన పెంచడం మరియు యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం నాడు స్థానిక చండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్థానిక ఫిజికల్ డైరెక్టర్లు, చండూరు పట్టణ యూత్ మరియు వాకర్స్, విద్యార్థులు మొదలైన వారితో ధ్యానం, యోగ , చండూరు మెయిన్ రోడ్ వెంట 2 ఖ తీబఅ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కటకం రమేష్, తేలుకుంట రాజకుమారి చంద్రశేఖర్, జెల్ల ధనమ్మ శ్రీనివాసులు, కో ఆప్షన్ సభ్యులు ఖలీల్, పోలీస్ సిబ్బంది ,మున్సిపల్ సిబ్బంది , పంచాయతి కార్యదర్శులు మొదలైన వారు విచ్చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది...

# రీజియన్ స్థాయిలో ప్రజలు సమస్యలను ప్రజావాణిలో తెలపాలి





**మిర్యాలగూడ మే 18:- (ప్రభాత సూర్య) :** డివిజన్ స్థాయిలో ఉన్న సమస్యలను ప్రజలు ప్రజావాణిలో తెలపాలని మిర్యాలగూడ ఆర్డీఓ ఎస్. రమణారెడ్డి కోరారు. సోమవారం మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ కాన్ఫరెన్స్ హాలులో ఆర్డీఓ రమణారెడ్డి పర్యవేక్షణలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ లోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు నలుగురు వివిధ సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు చేసుకున్నారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పరిష్కరించేందుకు అందజేశారు. ప్రజావాణిలో డివిజన్ కార్యాలయ పరిపాలన అధికారి బి.శ్రీనివాస్ శర్మ, తహసీల్దార్ పి.శ్రీనివాస్, ఐసీడిఎస్ అర్బన్ ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమత, వ్యవసాయ శాఖ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. ఋష్యేంద్రమణి, నీటిపారుదల శాఖ ఆర్ అండ్ బి డిఇఇలు ఎండి.అహ్మదుల్లా, శ్రీనివాస్, విద్యుత్ ఎఇ నవీన్, ఎస్సీ సంక్షేమ శాఖ హెచ్డబ్ల్యూఓ ఎండి.జానిమియా, డివిజనల్ పంచాయతీ కార్యాలయ ఎస్ఎ గులాం అలీలు పాల్గొన్నారు.

# వైటీపీఎస్ లో జరిగిన అగ్నిప్రమాదం పరిస్థితిని సమీక్షించిన ఎమ్మెల్యే బి ఎల్ ఆర్



**మిర్యాలగూడ మే 18:-( ప్రభాత సూర్య) :** దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపిఎస్)లో ఆదివారం మధ్యాహ్నం పవర్ స్టేషన్ లోని యూనిట్ 3లో టర్బైన్ డ్రివెన్ బాయిలర్ ఫీడ్ పంప్ వద్ద లూబ్రికేషన్ ఆయిల్ లీక్ కావడం వల్ల మంటలు చెలరేగి భారీ అగ్నిప్రమాదం జరగడంతో సోమవారం శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ అధికారులతో కలిసి ప్రమాదం జరిగిన యూనిట్ సందర్శించి, ప్రమాదం జరిగిన పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదంలో కంట్రోల్ కేబుల్స్, వాల్వ్‌లు దెబ్బతిన్నప్పటికీ, ప్రధాన యంత్రాలకు ఎలాంటి నష్టం జరగలేదని అన్నారు. కంట్రోల్ రూమ్ కి వెళ్లి ప్రమాదం జరిగిన సీసీ టీవీ విజువల్స్ పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు..



## ఘనంగా14 వ ఉర్సు రిజ్వాన్ (ర. ఆ) ఉత్సవాలు



**ప్రభాత సూర్య నర్సాపూర్ మే18:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కాసాల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ శ్రీ శ్రీ హజ్రత్ ఖాజా సూఫీ సయ్యద్ అజిజుద్దీన్ రిజ్వాన్ షాహి ఖాద్రి షిప్తీ కలందరి అమ్మది నయాబి అల్ మిర్జియా (ర. ఆ) ఉర్సు రిజ్వాన్ ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు.యోగీశ్వరులు దాసుడైన ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ హజ్రత్ సయీద్ పర్వేజ్ అజీజ్ సాహు షిప్తీ సందర్భంగా గంధం,దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, కవ్వాలి,అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీం ,గ్రామప్రజలు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి లో 63 ఫిర్యాదులు.....



**సైబరాబాద్ ప్రభాత సూర్య :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పౌరుల నుంచి మొత్తం 63 ఫిర్యాదులు అందాయి. వీటిలో టౌన్ ప్లానింగ్‌కు 42, ఇంజినీరింగ్‌కు 10, పారిశుధ్యానికి 3, ఎలక్ట్రికల్ విభాగానికి 2, అర్బన్ బయోడైవర్సిటీకి 2, ఎంటమాలజీ, ఎఫ్ అండ్ ఏ, ప్రాజెక్ట్స్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు నమోదయ్యాయి. అందిన ఫిర్యాదులపై సంబంధిత విభాగాధిపతులు సమీక్ష నిర్వహించి సకాలంలో పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక ట్రాకింగ్ ఐడి కేటాయించి పారదర్శకంగా పర్యవేక్షణ చేపట్టాలని, సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు నిరంతర ఫాలోఅప్ కొనసాగించాలని సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం కీలక వేదికగా నిలుస్తోందని అధికారులు పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పై డిప్యూటీ కమిషనర్ కి వినతి..



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :**మియాపూర్ 108 డివిజన్ పరిధిలో ఉన్న ప్రజా సమస్యలపై డిప్యూటీ కమిషనర్ కి ఫిర్యాదు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్, గుండె గణేష్ ముదిరాజ్ , జాజిరావు రాము, దర్గా శేఖర్ ముదిరాజ్ పాల్గొన్నారు.ప్రజలకు ఇబ్బందిగా మారిన రోడ్ల దుస్థితి, రోడ్డు రిపేర్ మరియు ప్యాచ్ వర్క్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకొని, రోడ్డు రిపేర్ మరియు ప్యాచ్ వర్క్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరడం జరిగింది.

# చైన్ స్నాచర్ను పట్టివేత 24 గ్రాముల పుస్తెలతాడు, బైకు స్వాధీనం

**మిర్యాలగూడ మే 18:-( ప్రభాత సూర్య):** మిర్యాలగూడ పట్టణంలో మహిళల మెడల్లోంచి బంగారు గొలుసులు లాక్కుని వెళ్లే దొంగ గొట్టిముక్కాల నాగ చిన్న వెంకటేశ్వర్లు అలియాస్ గిరి ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మిర్యాలగూడ పోలిసులు పట్టుకున్నట్టు డిఎస్పీ కె. రాజశేఖర్ రాజు తెలిపారు. పట్టణంలోని మందుల కాలనీలోని వైష్ణవి హోమ్స్ వద్ద సీసీ రోడ్డుపై ఈ నెల 11రాత్రి ఇద్దరు మహిళలు వాకింగ్ చేస్తుండగా యమహా బైక్ నిందితుడు మాస్క్ ధరించి వారికీ ఎదురుగా వచ్చి మెడలోని 3 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కుని పరరాయ్యాడని తెలిపారు. ఈ మేరకు బాధితుల నుండి ఫిర్యాదు తీసుకుని నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. ఛాలెంజ్ తీసుకుని జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ ఆదేశాలతో 2బృందాలు ఏర్పాటు చేసి దొంగను పట్టుకునేందుకు సీసీ ఫుటేజ్ ద్వారా దొంగను పట్టుకునేందుకు ముమ్మర యత్నాలు చేసి పట్టణంలోని హనుమాన్ పేట్ ఫ్లైఓవర్ వద్ద మరో స్నాచింగ్ యత్నిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతని నుండి సుమారు 24గ్రాముల బంగారు పుస్తెల తాడు యమహా బైక్, స్మార్ట్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మార్కాపురం



జిల్లా త్రిపురాంతకం మండలం మునివేముల గ్రామానికి చెందిన వాడని బెట్టింగులకు బానిసై రూ. 1.2లక్షలు అప్పు తీర్చేందుకు చైన్ స్నాచింగ్ చేస్తున్నాడని తెలిపారు. స్నాచింగ్ కు యత్నస్తుండగా చక్కచక్యంగా పట్టుకున్న దొంగను ఒన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఎం. నాగభూషణరావు, హెడ్ కాన్స్టేబుల్ రాజారాం, కాన్స్టేబుల్ నల్లగంతులు శ్రీను, గద్దల హుస్సేన్, బి.వీరబాబు, జి. నర్సింహా, బి. ప్రసాద్, జి. రాజ్ శేఖర్ రెడ్డిలను డిఎస్పీ రాజశేఖర్ రాజు అభినందించారు. సమావేశంలో ఎస్ఐ శ్రీనివాస్ నాయక్ ఉన్నారు.



## మంత్రి వివేకును కలిసిన ఐఎన్టీయూఎస్ నాయకులు సామ వెంకన్న

**నల్గొండ ప్రభాత సూర్య:** విశాఖ కంపెనీ యజమాని, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్మిక శాఖ మంత్రి, గడ్డం వివేక్ వెంకటస్వామి విశాఖ కంపెనీకి రావడం జరిగింది, ఈ సందర్భంగా, వివేక్ వెంకట స్వామి ని విశాఖ ఐ ఎన్ టి యు సి కార్మికులందరూ, పర్మినెంట్ వర్కర్స్, మరియు కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, కలిసి కార్మికుల సమస్యల గురించి చర్చించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో, ఐఎన్టీయూసీ మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షులు సామ వెంకన్న , మరియు ఐ ఎన్ టి యు సి, విశాఖ కార్మిక వర్గం, డాల్ భాస్కర్, కోశాధికారి కందుల శ్రీనివాస్, కృష్ణారెడ్డి మరియు కాంట్రాక్ట్ వర్కర్స్ నుండి ఐఎన్టియుసి లేబర్ యూనియన్ , వర్కింగ్ ప్రెసిడెంట్, నూకపంగా సతీష్, సాయి, శ్రవణ్ కుమార్, విజయ్ కుమార్, గణపతి, శ్రీకాంత్, తదితరులు పాల్గొని, మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది

## నల్గొండలో డైమండ్ చైర్స్ ఫ్లోరింగ్ మ్యాట్స్ ప్రారంభం



**నల్గొండ ప్రభాత సూర్య:** నల్గొండ పట్టణంలోని ఆర్పిరోడ్డు కెనరా బ్యాంకు ఎదురుగా సోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన డైమండ్ చైర్స్ ఫ్లోరింగ్ మ్యాట్స్, షాపును సోమవారం స్థానిక కార్పొరేటర్ నవీన్, పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారికి శు భాకాంక్షలు తెలిపారు. క్వాలిటీ, బ్రాండ్ డిజైన్స్ తో కూడిన వివిధ ఫర్నిచర్ అందుబాటులో ఉందని తెలిపారు. సరసమైన ధరలకు, రకరకాల కలర్ లతో, నాణ్యమైన ప్లాస్టిక్ ఫర్నిచర్స్ లభించును అని పట్టణ గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండి ఫహీం,నహీం, మోయిన్,ఉమర్ బాయ్, జానీ మియా,మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరు పోలీస్ స్టేషన్ మరియు చెక్ పోస్ట్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్..




**ఆలేరు మే 18 ప్రభాత సూర్య:** ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్ ఐపీఎస్ స్థానిక పోలీస్ స్టేషన్ ను, వరంగల్ హైదరాబాద్ రహదారిపై ఉన్న చెక్ పోస్టును అకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్లో క్రైమ్ రికార్డులు , పెండింగ్ లో ఉన్న దర్యాప్తు ఫైళ్ళు, బ్లూ కోల్ట్స్, పీకెట్స్, పనితీరు లాగ్ లను ఆయన తనిఖీ చేశారు. ఫోటో కాల్స్ లేకుండా క్షేత్రస్థాయిలో పోలీస్ స్టేషన్ పనితీరును, పోలీస్ స్టేషన్లో నిర్వాహణకు సంబంధించిన వివిధ విభాగాలను పరిశీలించారు. ప్రజలకు జవాబు దారిగా ఉండడం, పౌర కేంద్రీత పోలీసింగ్ పై ప్రధానంగా దృష్టి సారించారు. ఫిర్యాదుదారుల స్వీకరణ కేంద్రం,రిసెప్షన్ డిస్కో, ఫిర్యాదుదారుల రిజిస్టర్లను స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టేషన్కు వచ్చే ప్రతి పౌరుడితో గౌరవంగా ,మర్యాదగా ప్రవర్తించాలని వారి ఫిర్యాదు లను తక్షణమే నమోదు చేయాలని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, బలహీన వర్గాలపై జరిగే నేరాలకు సంబంధించిన పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అవినీతి, నిర్లక్ష్యంపై కఠిన చర్యలు అవినీతిగా పాల్పడిన, వీధుల్లో నిర్లక్ష్యం వహించిన లేదా ఎఫ్ఐఆర్ నమోద చేయడంలో ఆలస్యం చేసిన సదరు సిబ్బందిపై కఠినమైన క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దొంగతనాలను అరికట్టటానికి మరియు ప్రజల భద్రతను నిర్ధారించడానికి సమస్యాత్మక ప్రాంతాలలో రాత్రిపూట పెట్రోలింగ్ పెంచాలని తెలిపారు. చెక్ పోస్టును సందర్శించి వెళ్లే ప్రతి వాహనాన్ని నిశితంగా తనిఖీ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తే తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమై పోలీసింగ్ సామర్థ్యాన్ని పెంచేందుకు పలు కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ యాలాద్రి, ఎస్ఐ వినయ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా తీగలనగరంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవం నిర్వహణ



**పటాన్చెరు, మే 18,ప్రభాత సూర్య :** పటాన్‌చెరు నియోజకవర్గం జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని తీగలనగరం గ్రామంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో బీఆర్ఎస్ నాయకుడు, ఎండీఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని గ్రామ ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థనలు చేశారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, యువత మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వర్షాకాలానికి ముందే అంజయ్య నగర్ స్మశాన వాటిక పనులు పూర్తి చేయాలి: ఆంజనేయులు సాగర్..



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ స్మశాన వాటిక పునరుద్ధరణ పనులను వర్షాకాలానికి ముందే అత్యవసరంగా చేపట్టాలని కోరుతూ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ సిఎంసి కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సిఎంసి అడిషనల్ కమిషనర్ గీతా రాధిక ను కలిసి వినతిపత్రం అందజేశారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం స్మశాన వాటికలో ప్రజలు కర్మకాండలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని ఆయన వివరించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని కోరారు. ఈ విషయంపై స్పందించిన అడిషనల్ కమిషనర్ గీతా రాధిక టెండర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి పనులు త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపాడు.ఈ కార్యక్రమంలో అంజయ్య నగర్ కాలనీ అధ్యక్షులు నరసింహ సాగర్, జి రవి సాగర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# హజ్రత్ సయ్యద్ షా ఫఖీరుల్లా షా ఖాద్రీ 'ఉర్స్

**పెబ్బేరు, మే 18 ప్రభాత సూర్య:** తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలం, కొత్త సుగూరు గ్రామంలో షరీఫ్ కొలువై ఉన్న ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం ఆస్తానే ఆలియా ఖాద్రియా చిష్తియా దర్గాలో వాఖి అస్రార్ హజ్రత్ తాజ్ అల్వాలియ సర్కార్, హజరత్ సయ్యదిన సయ్యద్ షా ఫఖీరుల్లా షా ఖాద్రీ అల్ చిష్తి రహమతుల్లా అలై వారి వార్షిక ఉర్స్ షరీఫ్ మహోత్సవాలు.

- హజ్రత్ సయ్యద్ సైఫుద్దీన్ షా ఖాద్రి అల్ చిష్తి అల్ మారూఫీ పీరామియా సాహెబ్ ఆధ్వర్యంలో మే 19వ తేదీ నుండి 21వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు భక్తులందరూ తరలివచ్చి, సూఫీ సంతుల ఆశీస్సులు పొందాలని దర్గా కమిటీ వారు తెలిపారు
- గంధ మహోత్సవం సందల్ షరీఫ్. 19-05-2026 మంగళవారం.దీపారాధన చిరాగాన్ మహత్తర ఖవ్వాలి
- 20-05-2026 బుధవారం.
- దర్గా ప్రాంగణంలో దీపారాధన చిరాగాన్ అనంతరం, అంతర్జాతీయ ఖవ్వాల్‌లతో ఆధ్యాత్మిక అనుభూతిని పంచే ఘనమైన ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించబడుతుంది.
- ఖత్మే ఖురాన్ ఒ ఫాతేహా షరీఫ్
- తేది: 21-05-2026 గురువారం.
- సమయం: ఉదయం ఫజర్ నమాజ్ తెల్లవారుజామున అనంతరం ఖత్మే ఖురాన్, తరువాత నియాజ్ షరీఫ్ మహా అన్నదానం
- తేది: 21-05-2026 గురువారం
- సమయం: ఉదయం 11:00 గంటలకు
- విశేషం: ఉదయం ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులందరికీ "నియాజ్ షరీఫ్" పవిత్ర ప్రసాదం మహా అన్నదానం .వితరణ ప్రారంభమవుతుంది.
- ఉర్స్ మహోత్సవాలకు వచ్చే భక్తీ సమాజం కొరకు దర్గా ప్రాంగణంలో అన్ని రకాల వసతులు మరియు ఘనమైన భోజన వసతి నియాజ్ కల్పించబడ్డాయి. కులమతాలకు అతీతంగా భక్తులందరూ ఈ వేడుకల్లో పాల్గొని ఉర్స్ ఉత్సవాలను విజయవంతం చేయవలసిందిగా దర్గా నిర్వాహకులు,కమిటీ సభ్యులు, ప్రకటన తెలిపారు

## కామ్రేడ్ ఇక్కిరి ధర్మన్న ప్రజా ఉద్యమాలలో,విప్లవ ప్రతిఘటనోద్యమంలో

# అసువులు బాసిన అమరవీరుడు..

### ఆర్.జనార్ధన్,కార్యదర్శి. సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ...

**ఆలేరు మే 18 ప్రభాత సూర్య...:** పీడిత ప్రజల విముక్తి కోసం,విప్లవ ప్రతిఘటనోద్యమాన్ని నిర్మించి,ప్రజలను నడిపించిన ఆదర్శ విప్లవ కమ్యూనిస్టు,పోరాట పంథాలో ప్రజలను సమీకరించి పోరాడిన కామ్రేడ్ ఇక్కిరి ధర్మన్న మాఫియా ముఠా చేత దారుణంగా హత్య చేయబడ్డాడని,కామ్రేడ్ ధర్మన్న అమరత్వం పొందిన 21 సంవత్సరాలు అవుతున్నప్పటికి కామ్రేడ్ ధర్మన్న విప్లవ ఆశయం నేటికీ సజీవంగానే ఉన్నదని సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్,డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్ అన్నారు. సోమవారం రోజున ఆలేరు మండలం టంగుటూరు గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ అమరుడు కామ్రేడ్ ఇక్కిరి ధర్మన్న 21 వ వర్ధంతి సభ నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ జెండాను గ్రామ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ మారుజోడు సిద్దేశ్వర్ ఆవిష్కరించి ఇక్కిరి ధర్మన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా విప్లవనివాళులర్పించి, జోహార్లు అర్పించారు.ఈ సందర్భంగా జనార్ధన్,సహదేవ్ మాట్లాడుతూ కామ్రేడ్ ధర్మన్న ప్రజా,రైతాంగ విముక్తి పోరాటాలను నడిపిస్తున్న సమయంలో అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కున్నాడని తెలిపారు.ఇటీవల కాలంలో అయిదు రాష్ట్రాల ఎన్నికలలో గెలువగానే దేశం లో ప్రజలపై ఆర్థిక భారాలను మోపడానికి పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను పెంచిందని,ఇది ప్రజలను నమ్మించి మోసం చేయడమేనని అన్నారు.అన్ని రకాల పంటలకు కనీస గిట్టుబాటు ధరలు చెల్లించే బాధ్యతను మరిచి వరిధాన్యం ను కొనుగోలు చేయకుండా బీ జే పీ కేంద్ర ప్రభుత్వం రైతాంగాన్ని అనేక ఇబ్బందులకు గురి




చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ కే ఎం ఎస్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర సహాయ కార్యదర్శి మామిడాల భిక్షపతి,మండల వెంకన్న, మందారి డేవిడ్ కుమార్,జిల్లా గౌరవాధ్యక్షులు మామిడాల సోమయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కల్లెపు అడివయ్య,బేజాడి కుమార్,ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లు పద్మ సుదర్శన్,గడ్డం నాగరాజు, ఇక్కిరి శ్రీనివాస్,పీ ఓ డబ్ల్యూ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి ఆర్.సీత,ఎం.సుగుణ, మందనపల్లి ఉప సర్పంచ్ పద్మ శశిరేఖ,పీ ఓ డబ్ల్యూ జిల్లా నాయకులు తమ్మడి మాధవి,పాకాల సరిత, టంగుటూరు మాజీ సర్పంచ్ కట్టా సమరసింహారెడ్డి,పార్టీ నాయకులు చిర బోయిన రాజయ్య, కొత్తపేట వీరమల్లు,ఎలగందుల సిద్దులు,కల్లెపు నర్సింహులు, మారుజోడు కుమార్, తమ్మడి అంజయ్య,మామిడాల బాల మల్లేష్,లోకొమ్మిడి గోపాల్ రెడ్డి, చిర బోయిన కొమురయ్య,ఆర్.ఉదయ్, అయిల యాకయ్య, పెంద్యాల శ్రీను,పాకాల నరేష్, నల్ల నర్సింగరావు, వడ్డేపల్లి బాలరాజు,పైస రాందాసు, తమ్మడి రమేష్,యెర్రంబెల్లి ఐలయ్య,మామిడాల ప్రవీణ్,మామిడాల మహేష్, వడ్డేపల్లి సాయి, కుర్రి మార్కండేయ, కడకంచి బీరయ్య, సత్యనారాయణ, బత్తుల రాజిరెడ్డి,బుర్ర మల్లయ్య, నమిలే స్వామి,చిర బోయిన బాలయ్య,పంజాల మురళి, భూషె శ్రీశైలం, సుంచు రాములు తదితరులు పాల్గొన్నారు.




## ఈ నెల 26వరకు డబల్ బెడ్ ఇళ్ల మరమ్మతు పనులన్నీ పూర్తి చేయాలి:ఎమ్మెల్యే బిఎల్ఆర్

**మిర్యాలగూడ మే 28:-( ప్రభాకర్ సూర్య):** మిర్యాలగూడ పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ మరమ్మత్తు పనులను అధికారులతో కలిసి శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఇక్కడ నివసించేందుకు కావాల్సిన రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు , విద్యుత్, వంటి ప్రాథమిక వసతులన్ని ఈ నెల 26 లోపు పూర్తి చేసి అప్పగించాలని అధికారులను ఆదేశించారు. మౌలిక వసతుల ఏర్పాటుకు కావాల్సిన ప్రత్యేక నిధులను, రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధికారులను సంప్రదించి కేటాయించడం జరిగిందన్నారు.కావున అధికారులు పనులను వేగవంతం చేయాలని సూచించారు. అతి త్వరలో అర్హులైన లబ్ధి దారులకు అందరికీ ఇళ్ళ పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డిఓ ఎస్. రమణారెడ్డి, ఆర్ అండ్ బి డిఇఇ శ్రీనివాస్, అధికారులు, తహసీల్దార్ పి.శ్రీనివాస్ లు, పంచాయతీ రాజ్ అధికారులు, మున్సిపాలిటీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు..

## సైనిక్‌పురిలోని ప్యూర్ ఆర్థో హాస్పిటల్ లో నిర్వహించిన వైద్యులు అరుదైన పెల్విక్ ట్యూమర్‌కు శస్త్రచికిత్స విజయవంతం




**ప్రభాత సూర్య ,మల్కాజిగిరి:** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని సైనిక్‌పురిలో గల ప్యూర్ ఆర్థో హాస్పిటల్స్ వైద్యులు దాదాపు 10 సంవత్సరాలుగా ఒక భారీ కణితితో బాధపడుతున్న 32 ఏళ్ల వ్యక్తికి, అరుదైన, అత్యంత సంక్లిష్టమైన పెల్విక్ ట్యూమర్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు.వివరాలలోకి వెళ్తే గత పది సంవత్సరాలుగా వ్యక్తి పెల్విక్ ప్రాంతంలో 20 సెం.మీ ఐ 30 సెం.మీ కొలతలతో ఉన్న ఒక భారీ ఆస్టియోకాండ్రోమా ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఇది కాండ్రోసార్కోమా (ఎముక క్యాన్సర్)గా మారే అనుమానాస్పద లక్షణాలను ఉన్నట్లు వైద్యులు తెలిపారు.కణితి ఉన్న ప్రదేశం క్లిష్టంగా ఉండటం సంక్లిష్టమైన కండరాల , ఎముకల కణితి కేసులను నిర్వహించడంలో ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ డాక్టర్ వి. ఎస్. అభిలాష్ కుమార్ ప్యూర్ ఆర్థో హాస్పిటల్స్‌లోని క్షుణ్ణమైన క్లినికల్ మూల్యాంకనం, బహుళ-విభాగాల ట్యూమర్ బోర్డు సమీక్ష తర్వాత, ఒక ఖచ్చితమైన చికిత్సా వ్యూహాన్ని ఖరారు చేశారు. పునరావృతమయ్యే ప్రమాదాన్ని తగ్గించడానికి, సురక్షితమైన సర్జికల్ మార్జిన్‌లతో కణితిని పూర్తిగా తొలగించే లక్ష్యంతో, డాక్టర్ వి. ఎస్. అభిలాష్ కుమార్ నాయకత్వంలో, డాక్టర్ ఉదయ్ శేఖర్ రెడ్డి, డాక్టర్ మనోజ్ పుదారి, డాక్టర్ సాయి కార్తికేయ బద్రి, డాక్టర్ సాయి కృష్ణ సి ఎస్ ల సహకారంతో వైడ్ లోకల్ ఎక్సిషన్ ప్రొసీజర్ ద్వారా శస్త్రచికిత్స విజయవంతంగా చికిత్స చేసినట్లు తెలిపారు. కేసు సంక్లిష్టంగా ఉన్నప్పటికీ చికిత్సను తక్కువ ఖర్చుతో అందించామన్నారు . దీనివల్ల రోగి అధిక ఆర్థిక భారం లేకుండా డాక్టర్ లక్ష్మీ కుమార్ జస్తి నేతృత్వంలోని అనస్థీషియాలజీ , క్రిటికల్ కేర్ బృందం ఈ ప్రక్రియకు సహకరించగా, శస్త్రచికిత్స అనంతర ఐసియు సంరక్షణను డాక్టర్ గౌతమ్ రెడ్డి నిర్వహించారు. డాక్టర్ శ్రీ రామ్ ఎల్ పాల్గొన్నారు.

# రైతును కార్పొరేట్లకు అమ్మే దిశగా మోడీ అడుగులు ..

### ఏ.ఐ.కె.ఎం.ఎస్. జిల్లా మహాసభలో వక్తలు..

**ఆలేరు మే 18 ప్రభాత సూర్య:** చట్టాలు,బిల్లుల పేర్లతో రైతులను పూర్తిగా కార్పొరేట్లకు అమ్మేసి రైతులను బానిసలు చేసే దిశగా మోడీ వేగంగా తన అడుగులను వేస్తున్నారని అఖిల భారత రైతు.కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న,రాష్ట్ర సహాయ కార్యదర్శి డేవిడ్ కుమార్ అన్నారు. ఏఐకేఎంఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా 11వ మహాసభ ఆలేరు మండలం టంగుటూరులో జరిగింది. మహాసభకు ముందు స్థానిక కామ్రేడ్ కట్టా నర్సింహారెడ్డి స్మారక స్థూపం,కామ్రేడ్ ఇక్కిరి ధర్మన్న స్మారక భవనం నుండి రైతు.కూలీలు ప్రదర్శనగా మహాసభ హాల్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా హాజరైన బిక్షపతి,వెంకన్న, డేవిడ్ కుమార్ లు మాట్లాడుతూ ఈ దేశంలో రైతుని రాజని, రైతే దేశానికి వెన్నెముకని గొప్పలు చెప్పుకోవడం తప్ప, రైతుకు ప్రభుత్వాలు చేస్తున్నది ఏమీ లేదని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు పెడితే ఆ పెట్టిన కార్పొరేట్లకు రాయితీలు, ప్రోత్సాహకాలు, ఉచిత భూములు ఇస్తూ వారిని మరింత ధనవంతులుగా మారుస్తున్నారని అన్నారు. వ్యవసాయాన్ని చేసే రైతుకు మాత్రం కనీస గిట్టుబాటు ధర ఇవ్వడానికి కూడా ప్రభుత్వాలకు మనసు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వాలు తాము వేసిన స్వామినాథన్ కమిషనే రైతు పండించిన పంటకు వారికి వస్తున్నది పెట్టుబడిలో సగం మాత్రమే అని, రైతుకి గిట్టుబాటు ధర కల్పించాలని చెప్పినా కూడా, ఆ కమిషన్ మాటల్ని పట్టించుకోకుండా రైతుల్ని మోసం చేస్తూనే ఉన్నారని ఆరోపించారు.12 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ చట్టాలను రైతుల మంచి కోసమని చెప్పి తీసుకొచ్చి,రైతుల కడుపు




కొట్టే చర్యలు చేస్తున్నారని అన్నారు. విదేశీ విత్తనాలు దిగుమతి చేసుకొని వాటికి ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండా వారు పంపిన విత్తనాలను కొనాల్సిందే అనేటట్టుగా చట్టం చేశారని, అదేవిధంగా రైతుల మోటార్లకు మీటర్లు బిగిస్తూ సెల్ఫోను రీఛార్జి మాదిరిగా రైతు మోటార్ నడవాలంటే రీఛార్జ్ చేసుకోవాల్సిందే అని, ఉచిత కరెంటు అని మాటలు చెప్పి విచ్చలవిడిగా రేట్లు వసూలు చేయడానికే ఈ విద్యుత్ సవరణ చట్టమని, ఇలా మోడీ ప్రభుత్వం తీసుకొచ్చే ఏ చట్టమైన అది ప్రజల్ని,రైతుల్ని మరింత సమస్యల్లోకి నెట్టేసేదే తప్ప ఉపయోగపడేది కాదని అన్నారు. అకాల వర్షానికి పంట నాశనం అవడం,మార్కెట్లో పోసిన ధాన్యం తడిసిపోవడం మనం చూసామని, రైతుని ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు వారిని పట్టించుకోవడంలేదని అన్నారు. రాజకీయ పార్టీలు అధికారం రాకముందు మాకు ఓట్లు వేస్తే రైతులకు గిట్టుబాటు ధర ఇస్తామని మోసపు హామీలు ఇచ్చి, గెలిచిన తర్వాత పాత ప్రభుత్వాల లాగానే పాలిస్తున్నారని, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు బంధు స్థానంలో రైతు భరోసా అని చెప్పి రైతులకు ఏదో సాయం చేసినట్టు చెప్పుకుంటున్నారని కానీ రైతుకు కావాల్సింది సరియైన గిట్టుబాటు ధర అని, అదే నిజమైన భరోసా అని, ఆ గిట్టుబాటు ధర కల్పిస్తే ఏ రైతు ప్రభుత్వ బందుల కోసం ఆశించడని, ఆ గిట్టుబాటు ధర నుండి రైతుని మభ్య పెట్టడానికే ఇలాంటి పథకాలు ఇస్తున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు ముఖ్యంగా, కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నల్ల చట్టాలను ఎదిరిస్తూ రైతాంగం పెద్ద ఎత్తున ఆందోళనలు చేయాల్సిన అవసరం ఉన్నదని, లేనిపక్షంలో ఈ దేశ రైతాంగం కార్పొరేట్ బానిసగా మారడం తప్పదని, రైతాంగాన్ని ఏకం చేసి ఉద్యమాలను నిర్మించే దిశగా అఖిల భారత రైతు కూలీ సంఘం కృషి చేస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య, ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్,నాయకులు ఇక్కిరి సహదేవ్,చిరబోయిన రాజయ్య, చిరబోయిన కొమరయ్య, తమ్మడి అంజయ్య, పద్మ సుదర్శన్, మాలోత్ మోతిలాల్, అన్ రెడ్డి బాల్ రెడ్డి, చింత కింది సత్యనారాయణ, వంగాల మధుసూదన్ రెడ్డి, చిరబోయిన రాజయ్య, మామిడాల బాల మల్లేష్, పిన్నపురెడ్డి రాఘవరెడ్డి, తమ్మడి రమేష్, కొమ్మిడి గోపాల్ రెడ్డి, కొత్తపేట వీరమల్లు, టంగుటూరు మాజీ సర్పంచ్ కట్టా సమరసింహారెడ్డి, మారుజోడు సిద్దేశ్వర్, ఎలగందుల సిద్దులు, మారుజోడు కుమార్, నల్ల నర్సింగరావు, ఊరడి రామ చంద్రు,వడ్డేపల్లి బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.



# జాగ్రత్తగా ప్రయాణించండి ...సురక్షితంగా ఇల్లు చేరండి

**మునుగోడులో రహదారి భద్రతపై అవగాహన సదస్సు**



మునుగోడు, ప్రభాత సూర్య : పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి మునుగోడు మండల కేంద్రంలోని సత్య ఫంక్షన్ హాల్ లో పోలీస్ శాఖ మునుగోడు ఆధ్వర్యములో ప్రజలకు కళా జాత ఆధ్వర్యములో అవగాహన కల్పించారు.. ఏఎస్సై వెంకన్న పలు నిబంధనలు పాటించాలని సూచించారు.మితిమీరిన వేగం మందు సేవించి డ్రైవింగ్ చేస్తూ హెల్మెట్ పెట్టుకోకుండా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని,ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి జాగ్రతగా ప్రయాణించాలని సూచించారు..పాలకూరి నరసింహ గౌడ్,గజ్జల బాలరాజు గౌడ్, తీర్పాటి ఆంజనేయులు,,వివిధ గ్రామాల ప్రజలు,పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లాలో దారుణం!

- 8 మంది వద్ద అప్పులు... అందులో ఇద్దరిని లేపేశారు...
- అప్పు ఇచ్చిన 8 మందిని చంపేందుకు ప్లాన్
- ఇద్దరిని ఫామ్‌హౌస్‌కు పిలిపించి హత్య చేసిన నిందితులు
- బతికిపోయిన మిగిలిన ఆరుగురు

రంగారెడ్డి జిల్లాలో దారుణం జరిగింది. తమకు అప్పు ఇచ్చిన వారిని చంపేసిన దారుణ సంఘటన వెలుగు చూసింది. జిల్లాలోని మొయినాబాద్ లో జంట హత్యలు జరిగాయి. ఈ కేసు విచారణలో పోలీసులకు విస్తుగొలిపే విషయాలు తెలిశాయి. కరీమా బేగం దంపతులు, మరో వ్యక్తి తమకు అప్పు ఇచ్చిన 8 మందిని చంపేందుకు ప్లాన్ చేశారు. అందులో ఇద్దరు మహిళలను చంపేశారు. మరో ఆరుగురిని కూడా హత్య చేసేందుకు ఫామ్‌హౌస్‌కు పిలిచారు. కానీ వారు రాకపోవడంతో ప్రాణాలు దక్కాయి. ఇద్దరు మహిళల హత్య ఘటన వెలుగు చూసిన తర్వాత తమకూ ప్రాణహానీ ఉందంటూ ఆరుగురు మహిళలు పోలీసులను ఆశ్రయించారు.వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణానికి చెందిన అబేదాబేగం, మహబూబాబీ... అదే కాలనీలో ఉండే దంపతులు కరీమాబేగం, రెహమాన్, వీరి బంధువు నయాంకు వేర్వేరుగా కొంత డబ్బు అప్పుగా ఇచ్చారు. డబ్బు తిరిగి ఇస్తామని నమ్మించి ముందుగా మహబూబాబీని తొల్కట్ట ఫాంహౌస్ వద్దకు తీసుకువెళ్ళి గొంతు నులిమి హత్య చేసి, అక్కడే గొయ్యి తీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. ఆ తర్వాత అబేదా బేగంను కూడా అదేవిధంగా హత్య చేశారు.మిగిలిన ఆరుగురు మహిళలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు తవ్వకాలు చేపట్టారు. మొదట మహబూబాబీ అస్తిపంజరం బయటపడింది. ఆ తర్వాత అబేదాబేగం మృతదేహం కూడా బయటపడింది. అనంతరం నిందితులను విచారించగా, అప్పు ఇచ్చిన ఆరుగురిని కూడా చంపేందుకు కూడా ప్లాన్ చేసినట్లు ఒప్పుకున్నారు.

# కేబీఆర్ పార్కు వద్ద చెట్ల నరికివేత... సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**పార్కు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణంపై సుప్రీంకోర్టులో విచారణ**

**తదుపరి విచారణ వరకు చెట్లను కొట్టేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు**

హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్కు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో తదుపరి విచారణ వరకు చెట్లను కొట్టేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పార్కు పరిధిలో పర్యావరణపరంగా సున్నిత ప్రాంతంలో 25 నుంచి 30 మీటర్ల పరిధిలో ఉన్న చెట్లను కొట్టివేయవద్దని ఆదేశించింది. ఈ పనుల కోసం పార్కు పరిధిలో సుమారు 1,300 చెట్లు నరికేస్తున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. చెట్లు తొలగించడానికి ప్రణాళిక ఏమైనా ఉందా? చెట్లు తొలగించకుండా నిర్మాణం చేయవచ్చా? అని న్యాయస్థానం ప్రశ్నించింది. అలాంటి ప్రణాళిక ఏమీ లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

# పునాదుల దశలోనే అద్దాలకు రూ. 2,500 కోట్లు కేటాయించారు: పేర్ని నాని

అమరావతి కోసం భూములిచ్చిన రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడతారా అని వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని నిలదీశారు. ఈరోజు తాడేపల్లిలో మీడియాతో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. అమరావతిలో సచివాలయం ఇంకా పునాదుల దశలోనే ఉన్నా, అప్పుడే అద్దాల కోసం రూ. 2,500 కోట్లు కేటాయించి ప్రజా సొమ్మును వృధా చేస్తున్నారని మండిపడ్డారు. గత రెండేళ్లలో ఒక్క బిల్డింగ్ కూడా పూర్తి చేయలేదని, రైతులకు ఇవ్వాల్సిన రిటర్నబుల్ ప్లాట్లలో పనులు జరగడం లేదని విమర్శించారు.ప్రస్తుతం అమరావతిలో కేవలం మట్టి వ్యాపారం మాత్రమే జరుగుతోందని, రోజుకు వెయ్యి టిప్పర్లలో మట్టిని తరలిస్తూ టీడీపీ ఎమ్మెల్యేలు దోచుకుంటున్నారని ఆరోపించారు.

# పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

## ఎంఏ ఇక్బాల్ సిపిఎం జిల్లా నాయకులు ..దూపటి వెంకటేష్ సిపిఎం మండల కార్యదర్శి








**ఆలేరు మే 18 ప్రభాత సూర్య.:** సోమవారం రోజున కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు ఎంఏ ఇక్బాల్ సిపిఎం మండల కార్యదర్శి దూపటి వెంకటేష్ లు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరల వల్ల దేశంలో పేద మధ్యతరగతి ప్రజల జీవనం దుర్లభం అవుతుందని దాని ప్రభావం నేరుగా సామాన్య ప్రజల జీవితాలపై పడుతోంది.అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరల హెచ్చుతగ్గులు దేశీయంగా పెట్రోల్,డీజిల్ ధరలపై ప్రభావం చూపుతుండగా,ఆ ప్రభావం క్రమంగా అన్ని రంగాలకు విస్తరిస్తోంది. ఇంధన ధరల పెరుగుదలతో ఇప్పటికే ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతోంది.పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే మొదటగా ప్రభావితమయ్యేది రవాణా రంగం.సరుకు రవాణా ఖర్చులు పెరగడంతో కూరగాయలు, పండ్లు, నిత్యావసర వస్తువులు, నిర్మాణ సామగ్రి వంటి వస్తువుల ధరలు కూడా పెరిగే పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో మార్కెట్‌లో ధరలు మరింత పెరిగి సామాన్య ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతోంది.వ్యవసాయ రంగంపై కూడా ఇంధన ధరల పెరుగుదల ప్రభావం చూపుతోంది. వ్యవసాయ యంత్రాలు, ట్రాక్టర్లు, నీటి మోటార్ల నిర్వహణకు అవసరమైన ఖర్చులు పెరగడంతో రైతులు అదనపు భారాన్ని భరించాల్సి వస్తోంది. సాగు ఖర్చులు పెరగడం వల్ల వ్యవసాయ ఉత్పత్తుల ధరలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.ఒకవైపు ఉద్యోగ అవకాశాల కొరత, మరోవైపు పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, ఇంధన ధరల భారం కారణంగా మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు నెలవారీ ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతుండటంతో కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఇంధన ధరల పెరుగుదల కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా చిన్న వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, రవాణాపై ఆధారపడిన వర్గాల జీవనోపాధిపై కూడా ప్రభావం చూపుతోంది. ఆదాయం పెరగకపోయినా ఖర్చులు పెరుగుతుండటంతో వారు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని ప్రజలపై పెరుగుతున్న భారం దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంధన ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, పన్నుల తగ్గింపు వంటి నిర్ణయాల ద్వారా సామాన్యులకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి సూదగాని సత్య రాజయ్య సిపిఎం నాయకులు మోరిగాడి రమేష్ వడ్డేమాను బాలరాజు కాసుల నరేష్ సంఘీ రాజు యాసారపు ప్రసాద్ మోరిగాడి అశోక్ ఎండి మథిన్ ఎండి ఖలీల్ ఘనగాని రాజు మోరిగాడి లక్ష్మణ్ ఎర్ర రాజు తదితరులు పాల్గొన్నారు

# ఉస్మానియా యూనివర్సిటీ కీలక ప్రకటన.. డిగ్రీ పరీక్షల రీషెడ్యూల్

- బక్రీద్ పండుగ కారణంగా మే 28న ఓయూ పరీక్షలు రీషెడ్యూల్
- పరీక్షలను రీషెడ్యూల్ చేస్తామని స్పష్టం చేసిన వైస్ ఛాన్సలర్
- పరీక్షలు వాయిదా వేయాలని ప్రభుత్వానికి ఎంపీ ఒవైసీ విజ్ఞప్తి
- త్వరలో కొత్త పరీక్షల తేదీలను ప్రకటించనున్న ఓయూ అధికారులు
- తదుపరి అప్‌డేట్స్ కోసం అధికారిక వెబ్‌సైట్ చూడాలని సూచన



బక్రీద్ (ఈద్-ఉల్-అధా) పండుగను పురస్కరించుకుని ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) కీలక నిర్ణయం తీసుకుంది. మే 28వ తేదీన నిర్వహించ తలపెట్టిన పలు డిగ్రీ కోర్సుల పరీక్షలను రీషెడ్యూల్ చేయనున్నట్లు ప్రకటించింది. పండుగ తేదీపై స్పష్టత రావడంతో విద్యార్థుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి.ఈ నిర్ణయానికి ఒకరోజు ముందు ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు విజ్ఞప్తి చేశారు. బక్రీద్ పండుగ రోజే బీఏ, బీకాం, బీఎస్సీ వంటి పలు ముఖ్యమైన పరీక్షలను షెడ్యూల్ చేశారని, దీనివల్ల ముస్లిం విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని ఆయన తన ట్విట్టర్ ఖాతాలో పేర్కొన్నారు. బీకాం 4వ, 6వ సెమిస్టర్, బీఎస్సీ ఆనర్స్, బీఎస్సీ బయోమెడికల్ సైన్స్ సహా పలు పరీక్షల జాబితాను ప్రస్తావిస్తూ, వాటిని అనువైన మరో తేదీకి మార్చాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.ఓవైసీ విజ్ఞప్తి, విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగురాం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన సెలవుల ప్రకారం మే 27న ఎలాంటి పరీక్షలు షెడ్యూల్ చేయలేదని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ బక్రీద్ తేదీలో మార్పు ఉంటే, దానికి అనుగుణంగా మే 28న జరగాల్సిన పరీక్షలను రీషెడ్యూల్ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పరీక్షల తేదీలకు సంబంధించిన తదుపరి అప్‌డేట్స్ కోసం విద్యార్థులు ఎప్పటికప్పుడు అధికారిక వెబ్‌సైట్ (osmania.ac.in)qT గమనించాలని సూచించారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లోని చివరి నెల అయిన ధుల్-హిజ్జాకు సంబంధించిన చంద్రుడు ఆదివారం (మే 17) కనిపించకపోవడంతో ఇస్లామిక్ పండితులతో కూడిన మూన్ సైటింగ్ కమిటీ మే 19ని ధుల్-హిజ్జా మొదటి రోజుగా ప్రకటించింది. దీని ప్రకారం, ధుల్-హిజ్జా 10వ రోజైన బక్రీద్ పండుగ మే 28న వస్తుందని నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం కూడా తన అధికారిక సెలవుల జాబితాను సవరించి, మే 28ని బక్రీద్ పండుగకు సెలవుగా ప్రకటించనుంది. యూనివర్సిటీ త్వరలోనే వాయిదా పడిన పరీక్షలకు కొత్త తేదీలను ప్రకటించనుంది.

# బండి సంజయ్ లక్ష్యంగా బీఆర్ఎస్ పోస్టర్లు... స్పందించిన బీజేపీ చీఫ్

- బండి సంజయ్ ఎలాంటి తప్పుచేయలేదన్న రామచందర్ రావు
- బండి సంజయ్, బీజేపీపై రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శ
- వ్యక్తిని, కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం సరికాదన్న రామచందర్ రావు



కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ ఎలాంటి తప్పుచేయలేదని, కానీ ఆయనపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. బండి సంజయ్, బీజేపీపై రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిని, కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు.బండి సంజయ్ పైనా, బీజేపీపైనా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి బీఆర్ఎస్ రాష్ట్రమంతా పోస్టర్లు వేయించిందని విమర్శించారు. బండి సంజయ్ కుటుంబ సభ్యులు తప్పు చేస్తే న్యాయపరంగా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కానీ బండి సంజయ్‌ని లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం చేయడమేమిటని ప్రశ్నించారు. బండి సంజయ్‌ని కేటీఆర్ లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్ల కాలంలో మహిళలపై నేరాలు 67 శాతం పెరిగాయని ఆరోపించారు. మహిళలపై జరిగిన అత్యాచారానికి సంబంధించి కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ బాలిక కేసులో లేదా మద్యం కేసులో మహిళ జైలుకు వెళ్ళినప్పుడు లేదా తనను ఎమ్మెల్యే వేధిస్తున్నారని ఓ మహిళా సర్పంచ్ ఫిర్యాదు చేసినప్పుడు వారు రాజీనామా చేశారా అని నిలదీశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేతకాకపోతే రాజకీయాల నుంచి తప్పుకోవాలని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, ఫార్ములా ఈ-కార్ రేసులో కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిశాయి కాబట్టే వారిని అరెస్టు చేయడం లేదని ఆరోపించారు.

## కేరళంలో కొలువుతీరిన కొత్త ప్రభుత్వానికి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేరళ నూతన ప్రభుత్వానికి సోషల్ మీడియా వేదికగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కేరళ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వీడీ సతీశన్‌కు, అలాగే ఆయనతో పాటు మంత్రివర్గంలో కొలువుదీరిన మంత్రులందరికీ అభినందనలు అందజేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, కేరళంలో కొలువుదీరిన నూతన ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో పారదర్శకమైన, ప్రగతిశీలమైన సుపరిపాలనను అందిస్తూ కేరళంను మరింత అభ్యుదయ పథంలోకి తీసుకెళ్లాలని కోరారు. 'దేవుని సొంత దేశం'గా ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఖ్యాతి గడించిన కేరళం రాష్ట్రం, ఈ నూతన నాయకత్వంలో సరికొత్త అభివృద్ధిని, అపార సుసంపన్నతను సాధించాలంటూ పవన్ కల్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# మంత్రి టీజీ భరత్‌కు సిద్ధార్థరెడ్డి కౌంటర్

కర్నూలు: తాను ఎమ్మెల్యే కావాలనే కోరిక తనకంటే మంత్రి టీజీ భరత్‌కే ఎక్కువగా ఉన్నట్టు కనబడుతోందని వైఎస్సార్‌సీపీ యువజన రాష్ట్ర విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఎద్దేవా చేశారు. కర్నూలులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ నాయకుల వేధింపుల బాధితుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ తాము ధర్నాలు చేస్తే తమపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారంటూ టీజీ కుటుంబంపై మండిపడ్డారు. టీజీ వెంకటేశ్ అంటే గౌరవం ఉండేదని.. కానీ తనపై చేసిన వ్యాఖ్యలు చూశాక, ఆయనపై గౌరవం పోయిందన్నారు. తన తండ్రి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిని టీడీపీ నేతలు తిట్టినా స్పందించని ఎంపీ బైరెడ్డి శబరి.. మంత్రి భరత్ గురించి తాను మాట్లాడితే పరుగెత్తుకుంటూ వచ్చి ప్రెస్‌మీట్లు పెట్టడం విడ్డూరంగా ఉందని సిద్ధార్థరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకుని పోటీ చేయాలంటూ తనపై మంత్రి భరత్ చేసిన వ్యాఖ్యలకు గట్టిగా కౌంటర్ ఇచ్చారు సిద్ధార్థరెడ్డి. టీజీ భరత్ 48 సంవత్సరాల వయసులో మంత్రి అయ్యారని, 43 ఏళ్ల వయసులో ఎమ్మెల్యేగా పోటీ చేశారని.. ఇప్పుడు ఆయన వయసు ఇప్పుడు 50 ఏళ్లు అని చెప్పారు. 'నీ వయసుకు వచ్చినప్పుడు నేను ఎమ్మెల్యేగా పోటీ చేయకపోతే అప్పుడు అడగండి' అంటూ భరత్‌కు కౌంటర్ ఇచ్చారు. "కర్నూలు మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు నిరసనగా, అక్రమ కేసులకు వ్యతిరేకంగా ఈనెల 14న మేము ధర్నా కార్యక్రమం నిర్వహించాం. టీడీపీ నాయకుల వేధింపుల కారణంగా కర్నూలు పట్టణంలో ఆత్మహత్య చేసుకున్న సతీశ్ అనే కుర్రాడి కుటుంబానికి న్యాయం చేయాలన్న డిమాండ్‌తో ఆ రోజు ధర్నా చేశాం.



## దుబాయ్ రియల్టీలో భారత పెట్టుబడులకు బ్రేక్!

పశ్చిమాసియాలో ముదురుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక ముఖచిత్రాన్ని మారుస్తున్నాయి. ముఖ్యంగా భారతీయులకు అత్యంత ఇష్టమైన పెట్టుబడి గమ్యస్థానమైన దుబాయ్ రియల్ ఎస్టేట్ రంగంపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఇరాన్-అమెరికా యుద్ధం నేపథ్యంలో భారతీయ పెట్టుబడిదారులు కొంతకాలం వేచి చూసే ధోరణిని అవలంబించవచ్చని, దీనివల్ల దుబాయ్ రియల్టీలోకి వచ్చే భారతీయ మూలధనం తగ్గే అవకాశం ఉందని అనారాక్ మేనేజింగ్ డైరెక్టర్ ఆయుష్ పురి విశ్లేషించారు. అయితే, ఇది కేవలం తాత్కాలిక విరామం మాత్రమేనని, భారత్-దుబాయ్ మధ్య ఉన్న సుదీర్ఘ పెట్టుబడి బంధం చెక్కుచెదరదని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**ఆర్థిక అంశాలే కీలకం**

పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి భారత్‌పై రెండు రకాలుగా ప్రభావం చూపుతుందని ఆయుష్ పేర్కొన్నారు. భారత్ తన ముడి చమురు అవసరాల కోసం హార్మూజ్ జలసంధిపై గణనీయంగా ఆధారపడుతుంది. అక్కడ అంతరాయం కలిగితే చమురు ధరలు పెరిగి దేశీయంగా ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. గల్ఫ్ ప్రాంతంలో ఒత్తిడి పెరిగినప్పుడల్లా రూపాయి విలువ ఒడిదుడుకులకు లోనవుతుంది. దీనివల్ల విదేశీ కేటాయింపులు చేసే పెట్టుబడిదారులు తమ నిర్ణయాలను పునసమీక్షించుకోవాల్సి వస్తోంది. 'సంఘర్షణ స్వల్పకాలికమైతే అది కేవలం భయాందోళనలకు మాత్రమే పరిమితం అవుతుంది. కానీ అది సుదీర్ఘకాలం కొనసాగితే వినియోగదారుల ప్రవర్తన మారుతుంది. పెరిగిన లాజిస్టిక్స్ ఖర్చులు, రూపాయిపై ఒత్తిడి వల్ల పెట్టుబడిదారులు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తారు' అని ఆయూష్ వివరించారు.

**స్వదేశీ మార్కెట్‌కు కలిసొచ్చే అవకాశం**

దుబాయ్‌లో పెట్టుబడులు తగ్గడం భారతీయ ప్రీమియం హౌసింగ్ మార్కెట్‌కు వరంగా మారే అవకాశం ఉంది. విదేశాల్లో అనిశ్చితి నెలకొన్నప్పుడు పెట్టుబడిదారులు సురక్షితమైన స్వదేశీ మార్కెట్ వైపు మొగ్గు చూపుతారని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. దాంతో గురుగ్రామ్, ముంబై, బెంగళూరు వంటి నగరాల్లో లగ్జరీ ఇళ్లకు డిమాండ్ పెరుగుతుంది.

## టాటా పవర్ విద్యుత్ ఆదా ఉత్పత్తులు

హైదరాబాద్: టాటా గ్రూపునకు చెందిన విద్యుత్ పరికరాల తయారీ సంస్థ టాటా పవర్...రాష్ట్ర మార్కెట్లోకి విద్యుత్ ఆదా ఉత్పత్తులను విడుదల చేసింది. యాప్ ఆధారంగా కంట్రోల్ చేసుకునే విధంగా ఈజెడ్ హోమ్ స్మార్ట్ టెక్నాలజీతో రూపొందించిన ఈ పరికరాలు రూ. 250 మొదలుకొని రూ.20 వేల ధర లోపుల లభించనున్నాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. లైటింగ్,




వాతావరణానికి అనుగుణంగా లైటింగ్‌ను సెట్ చేసుకోవచ్చునని తద్వారా విద్యుత్ ఆదా కానున్నట్టు చెప్పారు. ఈ పరికరాలతో యేటా 15 శాతం వరకు విద్యుత్ ఆదా కానున్నదని, దీంతో ప్రతియేటా రూ.10 వేల వరకు బిల్లు తగ్గనున్నదని పేర్కొంది

## హ్యుందాయ్ వెన్యూ నైట్ లాంచ్: ధర ఎంతంటే?



హ్యుందాయ్ మోటార్ ఇండియా.. 2026 వెన్యూ నైట్‌ను రూ. 9.70 లక్షల (ఎక్స్-షోరూమ్) ధర వద్ద లాంచ్ చేసింది. ఇది పూర్తిగా నలుపు రంగులో ఉండటం చేత.. చూడటానికి సాధారణ వెన్యూ కంటే కొంత భిన్నంగా అనిపిస్తుంది. హ్యుందాయ్ వెన్యూ నైట్.. నలుపు రంగు ఫ్రంట్ గ్రిల్, రూఫ్ రైల్స్, ఓఆర్వీఎంలు పొందుతుంది. అంతే కాకుండా.. ఈ కాంపాక్ట్ ఎస్యూవీ నలుపు రంగులోని 16 అంగుళాల అల్లాయ్ వీల్స్‌పై నడుస్తుంది. అయితే బ్రేక్ కాలిపర్స్ ఎరుపు రంగులో ఉన్నాయి. ఇది మ్యాట్ బ్లాక్ హ్యుందాయ్ లోగోలు, ప్రత్యేకమైన నైట్ లోగోలు పొందుతుంది. వెన్యూ నైట్ ఇంటీరియర్ కూడా నలుపు రంగులోనే ఉంది. ఇందులో ఫీచర్స్ అన్నీ కూడా సాధారణ వెన్యూలో మాదిరిగానే ఉంటాయి. రంగులో మాత్రం వ్యత్యాసం కనిపిస్తుంది. ఇందులో డ్రైవింగ్, ఎమర్జెన్సీ ఉ ఈవెంట్, వెకేషన్, ఆన్-డిమాండ్ మరియు ఫోటో క్యాప్చర్ వంటి బహుళ రికార్డింగ్ మోడ్‌లు ఉన్నాయి. 2026 హ్యుందాయ్ వెన్యూ, పాత వెర్షన్‌లోని అవే ఇంజన్‌లతో అందుబాటులో ఉంది. కాబట్టి 1.2-లీటర్ పెట్రోల్, డీసీటీతో జత చేసిన 1.0-లీటర్ టర్బో-పెట్రోల్, మాన్యువల్ లేదా ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌తో వచ్చే 1.5-లీటర్ డీజిల్ ఇంజన్ ఉన్నాయి.

## జీసీసీ లీజింగ్.. రికార్డ్: పోటీ పడుతున్న విదేశీ సంస్థలు

విదేశీ సంస్థలు భారత్‌లో గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (జీసీసీలు) ఏర్పాటుకు పోటీ పడుతున్నాయి. ఇందుకు నిదర్శనంగా ఈ ఏడాది జనవరి--మార్చి త్రైమాసికంలో రికార్డు స్థాయిలో 9.1 మిలియన్ చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) కార్యాలయ స్థలాలను (ఆఫీస్ స్పేస్) జీసీసీల ఏర్పాటుకు విదేశీ సంస్థలు టాప్--9 నగరాల్లో తీసుకున్నట్టు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్ఈ తెలిపింది. ఒక త్రైమాసికంలో జీసీసీలకు సంబంధించి ఇదే గరిష్టమని పేర్కొంది. మార్చి త్రైమాసికంలో ఆఫీస్ స్పేస్ లీజింగ్ ఈ నగరాల్లో 5 శాతం పెరిగి 20.7 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరింది. 2025 మొదటి మూడు నెలల్లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ 19.7 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది. హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, చెన్నై, ముంబై, పుణె, ఢిల్లీ ఎన్‌సీఆర్, కోల్‌కతా, అహ్మదాబాద్, కోచి నగరాల డేటాను ఈ నివేదికలో సీబీఆర్ఈ ప్రస్తావించింది.జీసీసీ లీజింగ్ లావాదేవీలు రికార్డు స్థాయిలో నమోదు కావడం అన్నది సంక్లిష్టమైన సామర్థ్య కార్యకలాపాలకు భారత్ అంతర్జాతీయ కేంద్రంగా అవతరిస్తుండడానికి సంకేతమని సీబీఆర్ఈ ఇండియా చైర్మన్, సీఈవో అన్షుమన్ మేగజిన్ తెలిపారు. ఏదో ఒక రంగానికే ఈ డిమాండ్ పరిమితం కాలేదని, ఈ--కామర్స్, టెక్నాలజీ, బీఎఫ్ఎస్ఐ ఇలా ఎన్నో రంగాల్లో నెలకొన్నట్టు చెప్పారు. అమెరికా సంస్థలే ముందు.. టాప్--9 నగరాల్లో జీసీసీలకు సంబంధించి



తీసుకున్న లీజింగ్‌లో 73 శాతం అమెరికా సంస్థల నుంచే ఉన్నట్టు సీబీఆర్ఈ నివేదిక వెల్లడించింది. పర్యావరణ అనుకూలమైన సర్టిఫికేషన్, మెరుదైన సదుపాయాలు ఉన్న వాటికి కిరాయిదారులు ప్రాధాన్యమిస్తున్నట్టు సీబీఆర్ఈ ఎండీ (లీజింగ్ సర్వీసెస్) రామ్ చందానీ తెలిపారు.జీసీసీలు బహుళ కార్యకలాపాలకు సంబంధించి ఆవిష్కరణల కేంద్రాలుగా మారుతున్నాయని, ఏఐ అనుకూల కార్యాలయ వ్యూహాలను సంస్థలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. టాప్--9 నగరాల్లో బెంగళూరులో ఆఫీస్ లీజింగ్ 29 శాతం వాటాతో మొదటి స్థానంలో ఉంది. ఢిల్లీ ఎన్‌సీఆర్ 22 శాతం, ముంబైలో 16 శాతం వాటా కలిగి ఉన్నాయి. జనవరి--మార్చి త్రైమాసికంలో టాప్--9 నగరాల్లోని కార్యాలయ స్థలాల మొత్తం లీజింగ్‌లో ఈ మూడు నగరాల వాటాయే 67 శాతం ఉండడం గమనార్హం.




## టెస్లా మరో మోడల్ ఆగయా

### సింగిల్ చార్జింగ్‌తో 681 కిలోమీటర్లు

### ప్రారంభ ధర రూ.61.99 లక్షలు

ముంబై, ఏప్రిల్ 22: అమెరికాకు చెందిన విద్యుత్ కార్ల తయారీ సంస్థ టెస్లా..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆరుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసిన ఈ వైఎల్ మాడల్ ధర రూ.61.99 లక్షలుగా నిర్ణయించింది. ఇప్పటికే విడుదల చేసిన వై మాడల్‌కు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన రావడంతో ఈ నూతన మాడల్‌ను పరిచయం చేసింది. 5 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగం అందుకోనున్న ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 681 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. ప్రీమియం ఎస్‌యూవీ వాహన విభాగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో ఈ నయా మాడల్‌ను తీసుకొచ్చినట్టు టెస్లా ఇండియా జనరల్ మేనేజర్ శరద్ అగర్వాల్ తెలిపారు.ూబశీం ఉ ఎవష్ట్రఅఎశ్రీవం

**హైదరాబాద్‌లో షోరూం..**

టెస్లా హైదరాబాద్‌లో షోరూంను ఏర్పా టు చేయడానికి ముందుకొచ్చింది. ఇప్పటికే ఢిల్లీ, ముంబై, గురుగ్రామ్ నగరాల్లో మూడు ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను నిర్వహిస్తున్న సంస్థ..వచ్చే మూడు నెలల్లో హైదరాబాద్‌తోపాటు బెంగాల్, చెన్నై, అహ్మదాబాద్‌లలో షోరూంలను ప్రారంభించనున్నట్టు ప్రకటించింది. మెర్సిడెజ్ బెంజ్ విడుదల చేసిన ఈక్యూఎస్ మాడల్‌కు పోటీగా టెస్లా ఈ నూతన కారును ప్రవేశపెట్టింది

## చైనాలో రివర్స్ మైగ్రేషన్..



దశాబ్దాలుగా చైనా ఆర్థిక శక్తిగా ఎదగడంలో కీలకంగా నిలిచిన వలస కార్మిక వ్యవస్థ ఇప్పుడు అనూహ్య మలుపు తిరుగుతోంది. నగరాల్లోని ఫ్యాక్టరీలు, నిర్మాణ రంగాల్లో పనిచేస్తూ దేశ వృద్ధిని పరుగులు పెట్టించిన కోట్లాది మంది కార్మికులు ఇప్పుడు తిరుగుముఖం పడుతున్నారు. ఇది కేవలం ఒక సామాజిక మార్పు మాత్రమే కాదు, అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో వస్తున్న భారీ నిర్మాణాత్మక సంక్షోభానికి సంకేతమని ఆర్థిక నిపుణులు హెచ్చరిం

**ఎందుకు ఈ తిరుగు ప్రయాణం?**

చైనాలో సుమారు 300 మిలియన్ల (30 కోట్లు) వలస కార్మికులు ఉన్నారు. గతంలో గ్రామాల నుంచి నగరాలకు వెళ్లడం, ఎక్కువ సంపాదించి ఇంటికి డబ్బు పంపడం ఒక నిరంతర ప్రక్రియగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ నమూనా బీటలు వారుతోంది. దీనికి ప్రధాన కారణాలు..చైనా జీడీపీలో దాదాపు 25-30% వాటా కలిగిన స్థిరాస్తి రంగం కుప్పకూలడం నిర్మాణ కార్మికుల ఉపాధిని దెబ్బతీసింది. పెద్ద ప్రాజెక్టులు నిలిచిపోవడంతో వేలాది మందికి పనుల్లేకుండా పోయాయి.అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గడం, అమెరికా వంటి దేశాలతో వాణిజ్య ఉద్రిక్తతల వల్ల చైనా ఫ్యాక్టరీలలో నియామకాలు భారీగా తగ్గాయి.నగరాల్లో జీవన వ్యయం పెరగడం, దానికి తగ్గట్టుగా వేతనాలు పెరగకపోవడంతో వలస కార్మికులు తమ సొంత ప్రాంతాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు.

**నైపుణ్యం లేని వారికి ముప్పు**

చైనా ఇప్పుడు తన ఆర్థిక వ్యవస్థలో సాంకేతికతను అమలు చేస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్, హై-టెక్ మాన్యుఫ్యాక్చ రింగ్‌పై ప్రభుత్వం దృష్టి సారించింది. 'పాత పద్ధతుల్లో పనిచేసే కార్మికులకు కొత్త టెక్నాలజీ రంగంలో అవకాశాలు దొరకడం లేదు. ముఖ్యంగా వృద్ధ కార్మికులు ఈ మార్పునకు తట్టుకోలేక తిరిగి వ్యవసాయం వైపు లేదా అసంఘటిత రంగాల వైపు మొగ్గు చూపుతున్నారు' అని నిపుణులు చెబుతున్నారు.

**సవాళ్లు.. ఆందోళన**

చైనా ప్రభుత్వం గతంలో రవాణా రాయితీలు, నగరాల్లో నివాస అనుమతులు సడలించడం వంటి చర్యలు చేపట్టింది. కానీ, సమస్య ఇప్పుడు రవాణా కాదు, ఉద్యోగాల కల్పన. పరిశ్రమల్లో నిత్యం మార్పులొస్తున్నాయి.

## ఈ ఆర్థిక సంవత్సరంలో 'సీనియర్ సిటిజన్లు'

కొత్త చట్టం, కొత్త రూల్సు అమలులోకి వచ్చాయి. ఎన్నెన్నో మార్పులు, చేర్పులు, కూర్పులు. ప్రాథమికమైన అంశాలు మారకపోయినా కొన్నింటిలో మార్పులు వచ్చాయి. కొత్త ఆర్థిక సంవత్సరంలో కొత్త చట్టం, కొత్త రూల్స్ ప్రకారం కేవలం సీనియర్ సిటిజన్లకు వచ్చే మార్పులతో కలిపి అన్ని సంగతులు ఈ వారం తెలుసుకుందాం! ఎన్నిసార్లు చెప్పినా ముఖ్యమైనది కావున మళ్లీ మళ్లీ చెప్పే విషయం ఏమిటంటే ఈ ఆర్థిక సంవత్సరం నుంచి 'ఆర్థిక సంవత్సరం' అమల్లోకి వస్తుంది. గతంలోలాగా, అసెస్‌మెంట్ సంవత్సరం, గత సంవత్సరం అనే పదాలుండవు. ఇటు అసెస్సీ గానీ అటు గవర్నమెంట్, మరెవరైనా గానీ ఒకే పదం వాడాలి. ఇక నుంచి ఎవరికీ ఎటువంటి తికమక ఉండదు. స్టాండర్డ్ డిడక్షన్‌ని రూ.50,000 నుంచి రూ.75,000 వరకు పెంచారు. ఈ డిడక్షన్ అటు పాత పద్ధతిని అనుసరించే వారికైనా, ఇటు కొత్త పద్ధతికి వెళ్లే వారికైనా వర్తిస్తుంది. 80డి కింద ప్రయోజనం కేవలం పాత పద్ధతిని ఎంచుకున్న వారికే వర్తిస్తుంది. ఆరోగ్య బీమా, ముందు జాగ్రత్త హెల్త్ చెకప్‌కి సంబంధించిన తగ్గింపు రూ.50,000 వరకు కొనసాగుతుంది. గత వారం ఎంతో వివరంగా చెప్పాము. కొత్త 15హెచ్ గురించి ... ఇప్పుడది 121గా మారింది. ఈ ఫారమ్ సబి?మట్ చేస్తే టీడీఎస్ చేయరు. చేయకపోతే టీడీఎస్ రివకరీ చేసి గవర్నమెంట్ ఖజానాకి చెల్లిస్తారు. సీనియర్ సిటిజన్ల



ఆదాయం టాక్సబుల్ ఇన్‌కం. ఇప్పుడు దీని లిమిట్ రూ.12.75 లక్షలు అని చెప్పొచ్చు. ఇందులో స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేలు. మీ ఆదాయం బ్యాంకు వడ్డీ కానీ, అద్దె మీద ఆదాయం కానీ, పెన్షన్ మీద ఆదాయం.. అన్నీ కలిపితే రూ.12.75 లక్షల దాటకపోతే వెంటనే ఫారమ్ 121 సంబంధిత అధికారులకు ఇవ్వండి. పన్ను రికవరీ ఉండదు. 75 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్లకు పాత చట్టం 194పి ప్రకారం మూడు షరతుల మీద రిటర్న్ వేయనవసరం లేదు. ఈ అంశాలని చాలామంది అందరికీ అన్వయించుకుంటున్నారు. అది అపోహ. ఆ మూడు షరతులు ఏంటంటే...


(ఎ) కేవలం పెన్షన్ ఉండాలి

(బి) ఒక బ్యాంకు నుంచి మాత్రమే వడ్డీ ఉండవచ్చు

(సి) అదే బ్యాంకు మొత్తం టీడీఎస్ రికవరీ అయ్యి గవర్నమెంట్ ఖజానాలో జమ అయ్యి ఉండాలి ఇక ఫారాలు, గడువు తేదీ, అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లింపు బాధ్యతలు, సెల్ఫ్ అస్సెస్‌మెంట్ విధివిధానాలు ఇలాంటివన్నీ షరామామూలే.

**ఫైలింగ్ విధానంలో ఎటువంటి మార్పులు లేవు.**

ఇదివరకటి ఆలోచనే... ఎక్కువ ఇన్వెస్ట్‌మెంట్లు ఉండి ఎక్కువ సేవింగ్స్ ఉన్నవారికి పాత పద్ధతి. ఏ తగ్గింపులు ఉండవు. కొత్త పద్ధతిలో ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఎంపిక మీదే. కానీ ముందుగానే లెక్కలు వేసి ఆదాయం




# పెద్ది ఏమైనా దేవుడి పేరా..?

గ్లోబర్ స్టార్ యాక్టర్ రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం పెద్ది స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ డ్రామాగా వస్తోన్న ఈ చిత్రానికి ఉప్పెన ఫేం బుచ్చి బాబు సాన దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ జూన్ 4న 2026 థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్‌లో బిజీబిజీగా ఉన్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న ట్రైలర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఇక్కడ ఏ కుర్రోడిని అడిగినా ఫేవరేట్ ప్లే ఆట మారుతుంది కానీ ఫేవరేట్ ప్లేయర్ (ఆటగాడు) మారడం లేదు.. అంటూ బొమన్ ఇరానీ చెబుతున్న డైలాగ్స్‌తో షురూ అయింది ట్రైలర్. పెద్ది ఈ ఏరియాలో ఏమైనా దేవుడి పేరా.. అంటే నా ఫేవరేట్ క్రికెటర్ పెద్ది సార్.. నా ఫేవరేట్ రెజ్లర్ పెద్ది సార్.. నా ఫేవరేట్ రన్నర్ పెద్ది సార్.. ఈ కుర్రాళ్లకు ఫేవరేట్ గుడిలో దేవుడు కాదు.. గ్రౌండ్‌లో దేవుడు. ఆటే నా పొగరు.. అంటూ రాంచరణ్ చెబుతున్న డైలాగ్స్ అభిమానుల్లో ఫుల్ జోష్ నింపుతున్నాయి.

ఆ తర్వాత హీరోయిన్ జాన్వీకపూర్ ఎంట్రీ ఇవ్వడం.. ఆకాశంలో నుంచి చుక్కలు రాలిపడతాయంటారు కా కదా.. ఓ చుక్కమైనా విజయనగరంలో ఈ పూట రాలిపడినాదేంటి రా.. అంటూ స్నేహితుడిని అడుగుతూ కొత్త యాసలో సాగుతున్న రాంచరణ్ డైలాగ్స్ థియేటర్లలో అభిమానులు, మూవీ లవర్స్‌కు సరికొత్త అనుభూతిని అందించబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తున్నాయి. క్రికెట్, రెజ్లింగ్, రన్నింగ్.. ఇలా మల్టీ స్పోర్ట్స్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు ట్రైలర్‌తో హింట్ ఇచ్చాడు డైరెక్టర్. నాకు ఆట గెలవడం కాదు.. బతకడం కావాలి.. అంటూ కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ పవర్ ఫుల్ డైలాగ్స్‌తో అదరగొట్టేస్తున్నాడు. పాన్ ఇండియా రూరల్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. జగపతిబాబు, దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# దిల్ రాజ్ నిర్మాతగా సల్మాన్ మూవీ



పూజా కార్యక్రమాలతో ప్రారంభం

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ చిత్రం అధికారికంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శు క్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా విడుదలైన ప్రత్యేక వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. షూటింగ్ ప్రారంభంపై స్పందించిన సల్మాన్ ఖాన్, ఈ భారీ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్‌ను వచ్చే ఏడాది ఈద్ పండుగ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపారు. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ నిరాశ చెందవద్దు. మీ అంచనాలకు తగ్గట్టుగానే ఈ సినిమా ఉంటుంది అని అభిమానులకు హామీ ఇచ్చారు. ప్రతి ఏడాది ఈద్ సందర్భంగా ఆయన సినిమాలు విడుదలై భారీ విజయాలు సాధించడం తెలిసిందే. ఈ సినిమాలో సల్మాన్ సరసన లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. తెలుగు చిత్రసీమలో విజయవంతమైన సినిమాలతో గుర్తింపు పొందిన వంశీ పైడిపల్లి ఈ సినిమాతో హిందీ చిత్రసీమలో అడుగుపెడుతున్నారు. సల్మాన్ ఖాన్ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్, భావోద్వేగాల మేళవింపుతో కథ సిద్ధం చేసినట్లు సమాచారం. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. ఉన్నత సాంకేతిక ప్రమాణాలతో, ప్రేక్షకులను ఆకట్టుకునే యాక్షన్ సన్నివేశాలతో సినిమా రూపొందనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. బాలీవుడ్ స్టార్ హీరో, టాలీవుడ్ హిట్ దర్శకుడు కలయికలో వస్తున్న ఈ చిత్రం అభిమానుల్లో భారీ అంచనాలు రేకెత్తిస్తోంది. ఈద్ విడుదల లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఈ సినిమా, సల్మాన్ ఖాన్ కెరీర్‌లో మరో విజయవంతమైన చిత్రంగా నిలుస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. కాగా, గత కొన్నాళ్లుగా సల్మాన్ ఖాన్ హిట్స్ అందించలేక నిరాశలో ఉన్నారు.టాలీవుడ్ డైరెక్టర్‌తో చేస్తున్న సినిమాతో అయిన మంచి హిట్ అందుకుంటాడా అనేది చూడాలి.



# మెక్సికోలో వారణాసి సందడి

## భారతీయ పురాణగాథలకు యాక్షన్ మేళవింపు

## రాజమౌళి వీడియో వైరల్

భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కలయికలో రూపుదిద్దుకుంటున్న భారీ బ్జడెట్ చిత్రం 'వారణాసి'. ఈ చిత్రం తాజాగా మెక్సికో సిటీలో జరుగుతున్న అతిపెద్ద పాప్ కల్చర్ ఫెస్టివల్ లో సందడి చేసింది. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో ప్రదర్శించిన ఫస్ట్ గ్లింప్స్ చూసి అంతర్జాతీయ ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఇక ఈ వేడుకకు రాజమౌళి స్వయంగా హాజరు కాలేకపోయినప్పటికీ, ఆయన పంపిన ప్రత్యేక వీడియో సందేశం ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. మెక్సికో అభిమానులందరికీ నమస్కారం! 'వారణాసి' కేవలం ఒక సినిమా మాత్రమే కాదు.. అదొక అద్భుతమైన సాహసయాత్ర. భారతీయ పురాణ గాథలను , ప్రపంచస్థాయి యాక్షన్‌తో మేళవించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం అని రాజమౌళి పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ సినిమాలో మహేశ్ బాబును రాజమౌళి చూపిస్తున్న విధానంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రపంచ ప్రేక్షకులు మునుపెన్నడూ చూడని ఒక కొత్త మహేశ్‌ను ఈ సినిమాలో చూస్తారు అని జక్కన్న భరోసా ఇవ్వడం గమనార్హం. గ్లింప్స్‌లో మహేశ్ బాబు పొడవాటి జుట్టు, రఫ్ గడ్డంతో చాలా కరుకుగా కనిపించారు. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలో షూట్ చేసిన యాక్షన్ సీక్వెన్స్ హాలీవుడ్ స్థాయిని మించి ఉన్నాయని అక్కడి ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. దాదాపు రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న 'వారణాసి' మూవీ ఇప్పుడు ఇండియాలోనే మోస్ట్ వాంటెడ్ ప్రాజెక్ట్‌గా నిలిచింది. ఈ సినిమా గురించి వచ్చే చిన్న వార్త అయినా సోషల్ మీడియాను ఊపేస్తోంది.



# 15 ఏళ్ల తర్వాత సమీరా రెడ్డి రీఎంట్రీ.. బిగ్ మూవీలో ఛాన్స్

బాలీవుడ్ నటి సమీరా రెడ్డి సుమారు 15 ఏళ్ల తర్వాత రీఎంట్రీ ఇస్తుంది. 2014లో వ్యాపారవేత్త అక్షయ్ వర్దేను వివాహం చేసుకున్న సమీరా.. అంతకు ముందే సినిమాలకు గ్యాప్ ఇచ్చింది. కృష్ణం వందే జగద్గురుం (2012) మూవీలో ప్రత్యేక గీతంలో మాత్రమే ఆమె కనిపించారు. అయితే, ఇప్పుడు సంజయ్ దత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం 'ఆఖ్రీ సవాల్'లో కీలక పాత్రలో ఆమె నటిస్తుంది. ఈ చిత్రం మే 8న విడుదల కానుంది. ఆఖ్రీ సవాల్ మూవీలో సమీరా రెడ్డి పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. తన రీఎంట్రీ గురించి తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తను నటించబోయే పాత్రల ఎంపిక విషయంలో మరింత జాగ్రత్తగా ఉంటున్నానని సమీరా వెల్లడించింది. రొటీన్ కమర్షియల్ పాత్రల కంటే, నటనకు ఆస్కారం కల్పించే అర్థవంతమైన పాత్రలపైనే తన దృష్టి ఉంటుందని ఆమె నొక్కి చెప్పింది. ఆఖ్రీ సవాల్ చిత్రాన్ని జాతీయ అవార్డు దర్శకుడు అభిజీత్ మోహన్ వారంగ్ తెరకెక్కిస్తున్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ప్రయాణాన్ని కథగా రాసుకుని ఈ మూవీని తీసినట్లు సమాచారం. ఇందులో సంజయ్ దత్ ప్రొఫెసర్ గోపాల్ నాదకర్ణిగా ఒక కీలకమైన పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి కుమారుడు నమాశి చక్రవర్తి పీహెచ్‌డీ విద్యార్థి పాత్రలో కనిపించబోతున్నాడు.

# సతీ లీలావతిగా వస్తున్న లావణ్య త్రిపాఠి

టాలీవుడ్ ప్రముఖ నటి లావణ్య త్రిపాఠి మళ్లీ సినిమాలతో సందడి చేసేందుకు సిద్ధమయ్యారు. చాలాకాలం తర్వాత ఆమె నటించిన తాజా చిత్రం 'సతీ లీలావతి' ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మెగా హీరో వరుణ్ తేజ్‌తో వివాహం, అనంతరం ఓ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత విడుదల అవుతున్న ఈ సినిమా కావడంతో అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఇప్పటికే ఈ చిత్రంపై మంచి బజ్ క్రియేట్ అయింది. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో, దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మించిన ఈ చిత్రానికి తాతినేని సత్య దర్శకత్వం వహించారు. గతంలో 'భీమిలి కబడ్డీ జట్టు', 'ఎస్ఎంఎస్ (శివ మనసులో శృతి)' వంటి యూత్‌ఫుల్ చిత్రాలతో గుర్తింపు పొందిన ఆయన, ఈసారి ఒక రొమాంటిక్ రిలేషన్‌షిప్ డ్రామాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. లావణ్య త్రిపాఠి సరసన దేవ్ మోహన్ హీరోగా నటించగా, వీరిద్దరూ భార్యాభర్తలుగా కనిపించనున్నారు. ఈ సినిమా కుటుంబ బంధాలు, దాంపత్య జీవితం, వాటిలో వచ్చే సంఘర్షణలను వినోదాత్మకంగా చూపించనుందని నిర్మాత నాగమోహన్ తెలిపారు.







# టాక్సిక్‌లో యాక్షన్ సన్నివేశాలు అదుర్స్

## దర్శకురాలు గీతూమోహన్ ప్రతిభ అద్భుతం అన్న యశ్

యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'టాక్సిక్' ఈ సినిమా టీజర్ విడుదలైన నాటి నుంచి చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. 'టాక్సిక్'లోని సన్నివేశాల గురించి యశ్ ఇటీవల సినిమాకాన్ వేడుకలో మాట్లాడారు. ఈ యాక్షన్ చిత్రాన్ని ఒక మహిళా దర్శకురాలు తెరకెక్కిస్తు న్నందువల్ల సరికొత్తగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా దర్శకురాలు గీతూ మోహన్ దాస్‌పై ప్రశంసలు కురిపించారు. 'సాధారణంగా గ్యాంగ్‌స్టర్ డ్రామాలు అంటే పురుష దర్శకులే బాగా చేస్తారనే భావన చాలామందిలో ఉంటుంది. కానీ, ఈ గ్యాంగ్‌స్టర్ కథను ఒక మహిళా కోణంలో చూపించడం అనేది చాలా కొత్తగా ఉంటుంది. ఇందులోని శృంగార సన్నివేశాల నుంచి యాక్షన్ సీన్స్ వరకు ప్రతి దానిలోనూ ఆమె ఆలోచనలు చాలా స్పష్టంగా ఉన్నాయి. సున్నితమైన భావాలను ఎంత హృద్యంగా చూపించారో.. యాక్షన్ సన్నివేశాలను కూడా అదే స్థాయిలో తెరకెక్కించారు. అన్నిరకాల భావోద్వేగాలను లేడీ డైరెక్టర్ ఇంత బాగా ప్రజెంట్ చేయగలరా అని ఆమెతో ప్రయాణించాకే నాకు అర్థమైంది. ఇందులోని సన్నివేశాలు గతంలో చూడనివిధంగా విభిన్నంగా ఉంటాయి. గీతూ గొప్ప రచయిత కూడా.. ఆమె నుంచి నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నాను' అని యశ్ అన్నారు. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. యశ్ సరసన ఐదుగురు హీరోయిన్స్ నటిస్తున్నారు. మొదట ఈ చిత్రాన్ని మార్చిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని అనుకున్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.